శ్రీ సిద్ధేశ్వరస్వామి వారి ఆలయ చరిత్ర

తేరాల గ్రామం, దుర్గి మండలం, గుంటూరు జిల్లా.

పావులూరి సతీష్ బాబు

దేవాలయంలోని
విష్ణుమూర్తి, సూర్యదేవుడు,
నాగమ్మ, మహిశాసురమర్ధిని,
దుర్గ, చాముండి
నంది విగ్రహాలు

ఓం శ్రీ విఘ్నరాజాయ నమః

శ్రీ సిద్ధేశ్వరస్వామి వారి ఆలయ చరిత్ర

తేరాల గ్రామం. దుర్గి మండలం. గుంటూరు జిల్లా .

రచన

పావులూరి సతీష్‌బాబు



శ్రీభ్రమరాంబా సమేత సిద్ధేశ్వరస్వామి వార్లు

THE HISTORY OF SIDDESWARA SWAMI TEMPLE, TERALA

BY

PAVULURI SATISH BABU

© : Pavuluri Satishbabu, Printed: 18-8-2022, Copies : 200, Price : 80/-
Type setting : Pavuluri Mokshagna Chowdary, Jagruthi Chowdary,
Published by: Self Publishing, Pavuluri Satish Babu Macherla, Guntur Dist, Andhrapradesh – 522426, Mobile : +91 8523041222, Printed in India.

All rights reserved. No part of this book maybe produced, stored in a retrieval system, or transmitted in any form or by any means, electronic, mechanical, photo coping, recording, or otherwise without
written permission of the author
Copyrights reserved @ 2022 by Pavuluri Satish Babu

ISBN 978-93-5680-199-8

శ్రీ సిద్ధేశ్వరస్వామి వారి ఆలయ చరిత్ర

పావులూరి సతీష్‌బాబు

ప్రథమ ముద్రణ : ఏప్రిల్, 2018
కాపీలు : 1000
ద్వితీయ ముద్రణ : ఆగష్టు 18, 2022
కాపీలు : 200
హక్కులు : రచయితవి
మూల్యం : రూ. 80/-

డి.టి.పి.
పావులూరి మోక్షజ్ఞ చౌదరి
పావులూరి జాగృతి చౌదరి

డిజైన్
కార్తికేయ ఐడి & ప్రింట్ సొల్యూషన్స్
పాలువాయిగేటు, రెంటచింతల మండలం.
గుంటూరు జిల్లా - 522 421, సెల్ : 9666242969.

పావులూరి సతీష్‌బాబు
జర్నలిస్ట్, రచయిత.
మాచర్ల–522426.
గుంటూరు జిల్లా.
మొబైల్ : 8523041222

నా మాట

నేను విలేఖరిగా, చరిత్ర ప్రేమికునిగా పలనాడు ప్రాంతంలో మరుగునపడివున్న చరిత్రను పత్రికల ద్వారా, సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి తెస్తుంటాను. తేరాల గ్రామ చరిత్రపై కథనం రాయటానికి గ్రామానికి వెళ్ళి, ఆగ్రామ చరిత్ర తెలుసుకున్నాక ఇంతటి గొప్ప చరిత్ర బాహ్య ప్రపంచానికి అంతగా తెలియక పోవటం ఆశ్చర్యపరిచింది. గ్రామంలోని శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయం 1500 సంవత్సరాల పూర్వం నాటిదని శాసన ఆధారం ద్వారా తెలుస్తుంది. ఆలయానికి కొద్ది దూరంలోనే వున్న రూపులమ్మ గుడి 7వ శతాబ్ధంలో 1400 ఏళ్ళ క్రితం బాదామి చాళుక్యుల పాలనలో నిర్మించిందనే చారిత్రక ఆధారం లభించింది.

నేను మల్లన్న వొద్దుపై వున్న శిథిల శివాలయం పరిశీలించి కొండ దిగుతుండగా క్రీస్తు పూర్వం నాటి ఆదిమానవుల సమాధులను గుర్తించటం జరిగింది. ఇక్కడ సేకరించిన ఫోటోలు సోషల్‌మీడియాలో పోస్టుచేయగా తెలంగాణకు చెందిన చరిత్రకారులు రామోజు హరగోపాల్ గారు స్పందించి ఇంతటి చరిత్ర సోషల్‌మీడియాకు పరిమితం చేయద్దు దీనికి పుస్తక రూపం ఇవ్వాలని సూచించారు. వారి సూచన మేరకు పుస్తకం రాయాలని భావించి పుస్తకం ప్రింట్ వేయటానికి ఎంత ఖర్చు అవుతుందని నా మిత్రుడు రెంటచింతల మండలం, పాలువాయిగేటు వాస్తవ్యులు వేముల శ్రీనివాస్‌ని అడగగా ఖర్చుతో నీకనవసరం పుస్తకం అచ్చువేయించే భాద్యత నాదని ప్రోత్సహించెను.

ఇదివరలో ఈ చరిత్ర ఎవరైన రాసియున్నారా? అని విచారించగా 1933లో తేరాల శ్రీ సిద్ధేశ్వర శతకమును రాయవరం(మాచర్ల మండలం) గ్రామానికి చెందిన శ్రీ గుర్రం కోటయాఖ్యకవి గారు మరియు శ్రీ భ్రమరాంబ సమేత సిద్ధేశ్వరస్వామి వారి చరిత్రను తేరాల గ్రామానికి చెందిన శ్రీమేకల సుబ్బరాయుడు గార్లు రాసినట్లు తెలిసింది. ఆ పుస్తకాలను వారు చక్కగా రాసియున్నారు కానీ సమగ్రంగా లేదు. ఎన్నో చారిత్రక అంశాలు చూపలేదు. మేకల సుబ్బరాయుడుగారిని స్వయంగా కలసి గ్రామ, ఆలయ చరిత్ర గురించి విచారించాను. వారు రాసిన పుస్తకమే నాకు ఆధారమైనది. అంతేగాక స్వయంగా వారే కొన్ని చారిత్రక ఆనవాళ్ళను చూపించారు. వారికి నా కృతజ్ఞతలు.

వారు దృష్టి సారించని అంశాలతో పాటు మరింత సమగ్రంగా పుస్తకం పూర్తి చేసి, పుస్తకాలను దేవస్థానం అభివద్ధి కమిటికి అప్పగిస్తే వారు ఆ పుస్తకాలు విక్రయించి దేవాలయ అభివద్ధికి వినియోగించు కుంటారని తలచాను. తేరాల గ్రామ, సిద్ధేశ్వరస్వామి ఆలయ చరిత్రను సమగ్రంగా పరిశోధించి, శాసనాలను, ఇందుకు అవసరమైన గ్రంథాలను పరిశీలించి, మౌఖిక వివరణలను గ్రహించి ఈ పుస్తకమును పూర్తి చేయటం జరిగింది.

2018 ఫిబ్రవరి 13న శివరాత్రి పర్వదినం నాడు వెయ్యి ప్రతులతో పుస్తకావిష్కరణ జరిగి, కొన్ని పుస్తకాలను కమిటి వారికి, మరికొన్నిటిని ఉచితంగా పంచటం జరిగింది. ఇదే నాకు తొలి రచన. భక్తులు పుస్తకాన్ని ఆదరించారు. 2022లో వేముల శ్రీనివాస్ తిరిగి 200 పుస్తకాలు వేయిస్తానని ముందుకు రావటంతో ఆగష్టు నెలలో ద్వితీయ ముద్రణ నోచుకుంది. పుస్తక రచయితను సంప్రదించి, ఈ పుస్తకాన్ని భక్తులు ఎవరైనా అచ్చువేయించుకోవచ్చు, రచయితకు ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. చారిత్రక అన్వేషణలో నాకు సహకారం అందించిన రాచమంటి ఆదివిష్ణుయాదవ్, వెంకటేష్, మేకల భగవదాసు, మేకల సుబ్బరాయుడు, విద్యాధరణి మురళి, ఉప్పుతోళ్ళ రమేష్, పోలే కిరణ్, రచయిత మణిమేళ శివశంకర్(గుంటూరు)గార్లకు ధన్యవాదాలు.

బుధజన విధేయుడు

మాచర్ల 18-07-2022

పావులూరి సతీష్‌బాబు

జిల్లా, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల గ్రహీత,
పల్నాటి చరిత్ర కథా సమ్రాట్,బాలసాహిత్య సేవాబంధు.

డాక్టర్ బెజ్జంకి జగన్నాథాచార్యులు

"భాషా ప్రవీణ", యంఏ, యం.ఫిల్, పి.హెచ్‌డి.
ఇంటినెం. 12-2-4, శ్రీనివాసమహల్ వద్ద,
మాచర్ల-522426. సెల్. 09848562726.

ముందుమాట

"సత్రశాల మల్లీసుడు తేరాలన్ సిద్ధేశుడు
ఎత్తిపోత్ల దత్తుడుండి రక్షింతురు పల్నాటిన్" – పల్నాటి గేయకవిత. డాక్టర్ బెజ్జంకి

మన రెండు తెలుగు రాష్ట్రాలలో "సువర్ణాక్షరాలతో లిఖించబడిన చరిత్ర" మన పలనాటి చరిత్ర అనుట అక్షర సత్యం. ఈ ప్రాంత చారిత్రకతను ఘనతను చాటే ఎన్నో ఎన్నెన్నో అంశాలు, ఆనాడు వైభవోపేతంగా వెలుగొందిన ప్రాంతాలు, దేవాలయాలు, శిల్పసంపద, నేటికీ సాక్ష్యాలుగా మిగిపోయినవి ఎన్నోఉన్నాయి. కొన్ని నేటికీ వెలుగొందుచున్నాయి.

ఆ కోవకు చెందినదే మన తేరాల శ్రీభ్రమరాంబ సమేత సిద్ధేశ్వరస్వామి వారి దేవాలయం. మహామహిమాన్వితమై భక్తుల కొంగుబంగారమై కోరిన కోర్కెలు తీరుస్తున్నదైవం. తొలిఏకాదశి, మహాశివరాత్రి పర్వదినాలలో ఆశేష భక్తజన సందోహంతో ప్రభలతో శోభాయమానంగా విరాజిల్లుట మనమందరమూ చూస్తూనే ఉన్నాము.

కాని ఈ దేవాలయ చారిత్రక నేపథ్యం ఏనాటిదో మనకు తెలియజేసిన రచయిత "పావులూరి సతీష్‌బాబు" ధన్యుడు. పల్నాటి గడ్డమీద మక్కువతో పల్నాటిలోని పల్లె పల్లె తిరిగి అచటనున్న దేవాలయాలు, శిల్పాలు, శాసనాలు, వీరగల్లులు, క్రీస్తు పూర్వం నాటి ఆదిమానవుల సమాధులులను పరిశీలించి మరుగున బడిన ఘనతను వెతికి వెలికితీసి గ్రంథస్తంచేసి ముందుతరాలకు అందిస్తున్నారు. మన పూర్వుల ఘనచరిత్ర కాలగర్భంలో కలిసి పోకుండా గ్రంథస్తం చేయటం వ్యయప్రయాసలతో కూడినది. దానికి తగిన సహాయసహకారాలు అందించవలసిన బాధ్యత పల్నాటి వారిపై ఉంది. మన చరిత్రను మనం వెలుగులోకి తీసుకువద్దాం అనే దృఢసంకల్పంతో సహకరిస్తే "పావులూరి కలం పరుగులు పెడుతుంది" మరుగున పడ్డ మనచరిత్ర వెలుగు చూస్తుంది. ముందు తరాలకు అందించగలుగుతాం.మన పురిటిగడ్డ రుణం తీర్చుకున్నవారం కాగలం. **"జై పల్నాడు జై జై పల్నాడు"**

మాచర్ల.
20-07-2022.

డా. బెజ్జంకి జగన్నాథాచార్యులు, కవి, రచయిత.
పల్నాటి సాహిత్య పీఠం వ్యవస్థాపకులు, మాచర్ల.

జన్మదాతలు

శ్రీపావులూరి ఆంజనేయులు రేణుకాదేవి గార్లు

అంకితం

తమ్ముడు కీ॥శే॥ పావులూరి సురేష్‌బాబు

విషయసూచిక

క్రమ సంఖ్య	విషయము	పేజీ నెంబరు
01.	కథ ప్రారంభం, ఉనికి	08
02.	పుణ్యతీర్థం – స్థలపురాణం	09
04.	పుట్టు లింగం, పెట్టు లింగం	10
05.	శ్రీసిద్ధేశ్వర క్షేత్రం, ఆలయ చరిత్ర	12
06.	ఆలయ నిర్మాణము	13
07.	గాలిగోపురం	16
08.	విభూది గుండం (రుద్రగుండం)	17
09.	గోవుగర్భము	18
10.	శివ సాయుజ్యాన్నిచ్చే క్షేత్రం	20
11.	వీరగల్లు	22
12.	అంతా శివమయం	24
13.	అర్చకులు, ఉత్సవాలు	26
14.	రూపులమ్మ ఆలయం	27
15.	తేరాల గ్రామ చరిత్ర	31
16.	ఆదిమావుల నివాస ప్రాంతం	32
17.	కానువాగు, బ్రహ్మనాయుడు చెరువు	35
18.	దేవాలయ మాన్యములు	36
19.	అదృశ్యమైన రెండు గ్రామాలు	37
20.	ఆలయ శాసనములు	39
21.	దేవాలయ నిర్వహణ	47
22.	ఆధారములు	48

తేరాల శ్రీ సిద్ధేశ్వరస్వామి వారి ఆలయ చరిత్ర

పల్నాడు ప్రాంతంలో ఉన్న ప్రముఖ శైవక్షేత్రాల్లో తేరాల శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయం ఒకటి. పరశురాముడు పాపపరిహార్ధం దేశవ్యాప్తంగా ప్రతిష్ఠించిన 108 శివలింగాల్లో ప్రపధమ శివలింగంగా తేరాల సిద్ధేశ్వరస్వామి భాసిల్లుతున్నారు.

సర్వకామప్రదశ్చైవసిద్ధేశ్వరఇతిస్మృత:॥

సిద్ధేశ్వరుడు కామనలన్నిటినీ(అభీష్టములు) నెరవేర్చువాడని శివపురాణం కోటిరుద్ర సంహిత నందు తెలపబడినది. ఆయనను సేవించి అనేకులు సిద్ధి పొందారు.

ధర్మార్ధకామ మోక్షములనిచ్చునది, సిద్ధులచే పూజింపబడిన ఒక దివ్య శ్రేష్ఠలింగమునకు సిద్ధేశ్వరుడు అను నామము కలదు. ఈ శ్రీసిద్ధేశ్వరస్వామిని దర్శించి స్పృశించుట వలన మనస్సు నిర్మలమగును. అది సర్వదా స్వర్గద్వారమును తెరచియుంచును. పర్వదినములన్నింటియందు సర్వదేవతలు ఈ సిద్ధేశ్వరలింగమును దర్శించుటకు వచ్చెదరు. అట్టి పరమపవిత్రమైన శ్రీసిద్ధేశ్వరస్వామి జమదగ్ని మహార్షి ఆశ్రమ ప్రాంతమైన తేరాల గ్రామం నందు ఉండుట వలన తేరాల శ్రీ సిద్ధేశ్వరస్వామిగా విరాజిల్లుతున్నారు.

ఉనికి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లా, పల్నాడు తాలూకా, దుర్గిమండలం, తేరాల గ్రామ శివారున, బ్రహ్మనాయడు చెరువు ఒడ్డున శ్రీ భ్రమరాంబ సమేత సిద్ధేశ్వరస్వామి దేవాలయం కలదు. గూగుల్ మ్యాప్ లో ఉత్తర అక్షాంశం $16^{0}25'30.6'$, తూర్పురేఖాశం $79^{0}25'52.4'$ నందు ఆలయమును చూడవచ్చు.

పుణ్యతీర్థం

జలప్రాధాన్యత కలిగి, జలములో ఔషద, ఖనిజములు కలిగి, మానవ దేహమునకు ఆరోగ్యాన్ని కలిగించే జలసమృద్ధిగల నది, వాగు, కోనేరులో స్నాన మాచరించి పక్కనే నిర్మించిన దేవాలయమును దర్శించే క్షేత్రమును పుణ్యతీర్థమని ప్రతీతి. అట్టి విశేషంగల రుద్రగుండం(విభూదిగుండం) అనబడు కోనేరు పక్కనే ఉన్న శ్రీ భ్రమరాంబ సమేత సిద్ధేశ్వరస్వామి ఆలయం ప్రముఖ పుణ్యతీర్థంగా విరాజిల్లుతుంది.

స్థల పురాణం

త్రేతాయుగంలో మహీష్మతిపురం (మాచర్ల) రాజధానిగా హైహయ వంశానికి చెందిన కార్తవీర్యార్జునుడు పరిపాలన సాగించాడు. ఇతడు షట్‌చక్రవర్తులలో ఒకరు. కార్తవీర్యార్జునుడు మాచర్ల మండలం ఎత్తిపోతల వద్ద శ్రీదత్తాత్రేయ స్వామిని ఆరాధించి, స్వామి వారి వలన శత్రుజయమును, వేయి చేతులను, అణిమాదిసిద్ధులను, యశము, బలము, యోగీశ్వరత్వము, తేజము చెడని యింద్రియములను వరంగా పొందాడు. ఇతడు మాచర్లలో శ్రీ చెన్నకేశవస్వామిని ప్రతిష్ఠించారు. 12వ శతాబ్దిలో పలనాడును పాలించిన నలగామ, మలిదేవరాజులు హైహయవ వంశానికి చెందిన వారే. కార్తవీర్యార్జునుడు తండ్రి ఏకవీరుడు వీరి వంశమునకు మూలపురుషుడు.

ఒకనాడు కార్తవీర్యార్జునుడు తేరాల గ్రామం వద్దనున్న జమదగ్ని మహర్షి ఆశ్రమము సమీపంలో వేటకు వెళ్ళెను. అలసి పోయిన కార్తవీర్యార్జునుడు తన సైనికులుతో కలసి విశ్రాంతి కొరకు జమదగ్ని ఆశ్రమంకు చేరారు. ఆ మహర్షి రాజుకు, అయన పరివారానికి షడ్రషోపేతమైన విందును ఏర్పాటు చేస్తే, కార్తవీర్యార్జునుడు అశ్చర్యపోయి ఇది ఎలా సాధ్యము అని అడుగుతాడు. అప్పుడు జమదగ్ని దీనికంతటికి కారణము సురభి అనే తమ హోమధేనువని, ఈ గోవు కోరిన కోరికలు తీర్చే కామధేనువు సంతానానికి చెందినదని చెబుతాడు. ఆ గోవుపై కోర్కె గలిగిన రాజు ఆ గోవును తనకు ఇవ్వమని అడుగుతాడు. జమదగ్ని నిరాకరించగా కార్తవీర్యార్జునుడు జమదగ్ని మహర్షిని సంహరించి, బలవంతగా గోవును అపహరించుకుపోతాడు.

జగదగ్ని భార్య రేణుకాదేవి భర్తతో సహగమనము చేయుచుండగా వారి కుమారుడు పరశురాముడు వద్దని వారించి, తండ్రిని తిరిగి బ్రతికించుకుంటానని ప్రతిజ్ఞ చేస్తాడు.

పరశురాముడు సాక్షాత్తు శ్రీమహావిష్ణువు దశావతారాలలో ఆరవ అవతారం. మహీష్మతిపురంకు కేగి కార్తవీర్యార్జునుడుతో యుద్ధం చేసి, తన పరశువు (గొడ్డలి)తో కార్తవీర్యార్జునుడి వెయ్యిచేతులను, తలను ఖండించి, కామధేనువుని ఆశ్రమానికి తెచ్చి, తండ్రిని తిరిగి బ్రతికించుకుంటాడు. అయినా ఆవేశం చల్లారని పరశురాముడు యావత్ క్షత్రియ జాతి పై 21 మార్లు దండెత్తి వారందరిని సంహరిస్తాడు.

రాజు ఎంతటి దుష్టుడైనను అతడ్ని చంపుట దోషమని, అందునా శ్రీదత్తాత్రేయస్వామి వరప్రసాది కార్తవీర్యార్జునునితోపాటు యావత్ క్షత్రియులను సంహరించటం చేత నీకు పాపకళంకం చుట్టుకుంది, ఆపాపపరిహార్థం తక్షణమే నీవు పరమశివుడ్ని ప్రసన్నం చేసుకోవాలని జమదగ్ని పరశురాముడుకి చెప్పెను. పరశురాముడు ఆశ్రమం సమీపంలోని తపస్సు ప్రారంభించెను. అంతట పరమశివుడు ప్రత్యక్షమై108 శివలింగాలను ప్రతిష్ఠించటం వలన నీవు పాప విమోచనం పొందుతావని చెప్పెను. దాంతో పరశురాముడు అనేక యాగాలు, రుద్రహోమములు చేసి ఇచ్చట శివలింగమును ప్రతిష్ఠించెను. ఆనాటి నుండి పరశురాముడు ప్రతిష్ఠ చేసిన 108 శివలింగాలలో ప్రప్రథమ శివలింగంగా తేరాల సిద్ధేశ్వరస్వామి కీర్తించబడుతున్నాడు.

పుట్టు లింగం - పెట్టిన లింగం

శివాజ్ఞ మేరకు పరశురాముడు ఇచ్చట శివలింగాన్ని ప్రతిష్ట చేయటానికి విశ్వకర్మ చే లింగాకారాన్ని చేయించి తీసుకురాగా, అప్పటికే సాక్షాత్తు పరమశివుడే స్వయంభూఃగా వెలసి తేజోమయంగా వెలుగొందుతుంటాడు. అది చూసిన పరశురాముడు ఇది దైవ సంకల్పంగా భావించి విశ్వకర్మ తయారు చేసిన శివలింగంను స్వయంభూః లింగం వెనుక భాగాన ప్రతిష్టించెను. ఇప్పటికీ భక్తులు ఈ ఆలయ గర్భాలయంలోగల రెండు శివలింగములలో ఒక లింగాన్ని పుట్టు లింగమని, మరొక లింగాన్ని పెట్టుడు లింగమని పిలుస్తారు.

గర్భాలయంలోని రెండు శివలింగములు

స్వయంభూః (పుట్టు) శివలింగం



పరశురాముడు ప్రతిష్ఠచేసిన(పెట్టు)శివలింగం

శ్రీ సిద్ధేశ్వరక్షేత్రం - ఆలయ చరిత్ర

సప్త ఋషులలలో ఒకరైన జమదగ్ని మహార్షి ఆశ్రమ ప్రాంతం తేరాల. ఇక్కడ కొలవుదీరిన సిద్ధేశ్వరుడు మహిమాన్వితుడు. తపోధనులైన మునులీప్రదేశమున తపములు చేసి, స్వామిని సేవించి సిద్ధినొందినారని ఈ క్షేత్రానికి శ్రీసిద్ధేశ్వరక్షేత్రమని పేరు.

సిద్ధులు అనగా సాధారణ వ్యక్తులకు ఉండని, అతీంద్రీయ శక్తిసంపన్నులను సిద్ధులు అంటారు. వీరు తపము ద్వారా దేవతలను ప్రసన్నంచేసుకొని అతీంద్రీయ శక్తులను పొందుతారు.

ఈ సిద్ధేశ్వరక్షేత్రం దక్షిణ కాశీగా పేరొందినది. ప్రతి క్షేత్రాన్ని దక్షిణ కాశీ అనుట మనము వింటుంటాము. అయితే ఈ సిద్ధేశ్వరక్షేత్రంకు ఒక ప్రత్యేకత ఉన్నది. కాశీలో ఉన్న పరమ పవిత్రమైన గోగర్భం తేరాల క్షేత్రంలో వుండట వలన దక్షిణకాశీ అను పేరు. కాశీలో గోగర్భ గంగాస్నానం ఎంత పవిత్రమో, ఈ క్షేత్రంలోని గోగర్భమందు జలంలో మునిగితే అంతటి ఫలం దక్కుతుంది. అంతేగాక ఈ ఆలయం నందు శివభక్తులు శివసాయిజ్యం కోరి ఆత్మార్పణ(బలిదానం) చేసుకునేవారిని ఇక్కడి శిలలు(వీరగల్లులు) ద్వారా తెలుస్తుంది. ఈ తేరాల శ్రీ సిద్ధేశ్వరస్వామి ఆలయం వివిధ సమయాల్లో అభివృద్ధి జరిగినట్లు శాసనాలు ద్వారా తెలుస్తుంది.

ఇక్ష్వాకులు, పల్లవులు, తూర్పు చాళుక్యలు, చోదులు, హైహయ, కాకతీయ, రెడ్డి, విజయనగర, గజపతి తదితర రాజుల పాలనలో తేరాల శ్రీసిద్ధేశ్వరక్షేత్రం గొప్ప శైవక్షేత్రంగా వెలుగొందింది. ఎందరో పాలకులు సిద్ధేశ్వర దేవర సేవలో తరించి, దేవాలయానికి బంగారం, భూములను సమర్పించారు. ఈ ఆలయ నిర్మాణం 1500 సంవత్సరాల క్రితం నాటిదని చరిత్రకారుల అభిప్రాయం. క్రీ.శ 679 లో తూర్పు చాళుక్య చక్రవర్తి విష్ణువర్ధనుడు పాలనలో, క్రీ.శ. 1292 కాకతీయ చక్రవర్తి రుద్రదేవ మహారాజు పాలనలో, క్రీ.శ. 1156, 1157లో పల్నాడు ప్రాంతాన్ని పరిపాలించిన హైహయ వంశస్థులు మైలమ కామరాజు (నలగామరాజు), మాచర్ల ప్రభువు మలిదేవరాజులు పాలనలో, క్రీ.శ. 1243లో కంచరి పరిటాల గొంకిసీడు మనువడు పోతినేని

త్రిపురనాయుడు, క్రీ.శ 1444లో మహామండలేశ్వర జగన్నాథ సేవకుడు మానేపల్లి యఱమంద తదితరలు దేవాలయం అభివృద్ధికి, స్వామి వారి నిత్య పూజాకైంకర్యాలకు అనేక దానాలు ఇచ్చారు. వాటి వివరాలు ఈ ఆలయ ప్రాంగణంలోని శిలాశాసనాలు ద్వారా తెలుస్తున్నాయి.

ఆలయ నిర్మాణం

శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయాన్ని రాతితో నిర్మించారు. దేవాలయం పశ్చిమ(పడమర) ముఖంగా ఉంటుంది. ఆలయానికి పడమర, ఉత్తర, దక్షిణ ద్వారాలు ఉన్నాయి. పడమర రాతిద్వారం గుండా లోనికి రాగానే మహామండపం, ఆ మండప మధ్యభాగంలో నందిమండపం కనపడుతుంది. పూర్వం ఈ నందిమండపమే రంగమండపం. స్వామి వారి కీర్తిని చాటుతూ ఈ మండపమందు గాన, నృత్య కార్యక్రమాలు జరిగేవి. తరువాత కాలంలో మండపంలో నందిని ఏర్పాటు చేయటంతో నందిమండపంగా మారింది.

ఈ నంది మండపం దాటగానే అంతరాలయం ఉన్నది. అంతరాలయం రాతిద్వారం ఇరువైపుల ద్వారపాలకుల శిల్పాలు చెక్కబడి వున్నాయి. ద్వారపాలకులు పక్కనే వినాయకుడు, దుర్గామాత, ఒక వీరమహేశ్వరుడు(ఆత్మర్పణ చేసుకున్న భక్తుడు) రాతి విగ్రహాలు ఉన్నాయి. అంతరాలయంలో ఉత్తరముఖమై దక్షిణవైపు శ్రీభ్రమరాంబ అమ్మవారు కొలువైయున్నారు. ఈ అమ్మవారు శ్రీదుర్గామాత రూపంలో వున్నారు. భ్రమరాంబగా పూజింపబడుతుంది. ఈ అమ్మవారు రాయవరం(మాచర్ల మండలం)గ్రామం నుండి వచ్చినట్లు ప్రచారం కలదు.

అంతరాలయం మధ్యభాగంలో నందీశ్వరుడు కొలువుదీరియున్నాడు. నందిని దాటగానే గర్భాలయం ఉంటుంది. మొత్తం రాతితో నిర్మించారు. గర్భాలయంలో స్వయంభూఃగా వెలిసిన శ్రీసిద్ధేశ్వర లింగము, దానివెనుకే పరశురాముడు ప్రతిష్ఠించిన మరొక శివలింగము పానవట్టములపై దర్శనమిస్తాయి. స్వయంభూః లింగమును పూర్వం కొందరు దొంగలు నిధినిక్షేపాల కోసమని పెకిలించగా, ఆ దొంగలు చూపు కోల్పోయారు. దొంగలు చేసిన పని వలన శివలింగం పూర్వ స్వరూపం కోల్పోయి కనపడుతుంది.

ఒకే గర్భాలయంలో రెండు శివలింగాలు ఉండటం ఈ క్షేత్రం నందు ఒక ప్రత్యేకత. గర్భాలయ విమానం(శిఖరం) రాతితో నిర్మించి యున్నారు. చాళుక్యుల నిర్మాణ శైలిలో గుండ్రని రాయి శిఖంపైన ఉండేది. ఇదికూడా నిధులు కోసం పగులగొట్టబడింది. దాంతో ఆలయ శిఖర పై భాగాన్ని తిరిగి నిర్మించారు. ఆలయ దూలాలు, పై కప్పు కూడా రాతితో నిర్మించినదే. ఆలయం ఎదుట చతురస్రాకారంలో 6 అడుగుల లోతుగల రుద్రగుండం (విభూది కొలను) కలదు. కోనేరు మధ్య భాగమున శివలింగం గల మందిరం, దానికి ఎదురుగా పడమర ముఖంగా నందీశ్వరుడు విగ్రహం కలదు.

కోనేరు దక్షిణం వైపున మరో శివలింగం కలదు. ఆలయ ఉత్తరం వైపు చిన్న కోనేరు పై గోవుగర్భమనే మందిరం నిర్మాణం కలదు. ఈ కట్టడానికి దీర్ఘచతురస్రాకారంలో జాన వెడల్పు, మూరకు కొంచెం పైగా ఎత్తు గల చిన్న ప్రవేశద్వారం కలదు.

విభూదికొలను, గోవుగర్భం అనే చిన్నకోనేరులో పూర్వం ఏ కాలంలోనైనా సహజ సిద్దంగా ఊటనీరు 4 అడుగుల దాకా వుండేది. భక్తులు పుణ్యస్నానాలు అచరించేవారు. అయితే మాచర్ల కెసిపి సిమెంట్ ఫ్యాక్టరీ వారి గనులు దేవాలయం సమీపంలోనే వుండటం వలన వారు రాయి కోసం లోతుగా త్రవ్వటం మూలంగా కొలనులలో నీటి జాడ అగుపించటం లేదు. దీంతో ప్రత్యామ్నాయంగా బోరు ద్వారా కోనేరును నీటితో నింపాల్సి వస్తుంది. ఆలయం ఎదుట వివిధ రాజుల కాలంలో దేవాలయానికి సమకూర్చిన వసతలు గూర్చి వేయించిన ఆరు శిలాశాసనాలు కలవు. ఈ శాసనాలు పక్కనే విష్ణుమూర్తి, సూర్యదేవుని శిల్పాలు కలవు. ఆలయం దక్షిణ వైపున ఓ శిథిల మండపం, దాని పక్కనే శిథిల అన్నదాన సత్రం కలవు. గోగర్భం వెనుక దక్షిణ ముఖమై ఒక వీరమహేశ్వరుడి ఆత్మార్పణ శిల కలదు. దాని పక్కనే నాగశిల ఉన్నది. గోగర్భం ఎదుట, ఆలయ ఉత్తర ద్వారం ఇరువైపుల మహిషాసురమర్ధిని, చాముండి శిల్పాలు కలవు.

కాలేశ్వరం(తెలంగాణ), కూడేరు(అనంతపురం జిల్లా), ముక్త్యాల(కృష్ణా జల్లా) శివాలయాల గర్భగుడుల్లో కూడా రెండు శివలింగములు ఉన్నవి.

శ్రీభ్రమరాంబ సమేత సిద్ధేశ్వరస్వామి ఆలయం

శ్రీభ్రమరాంబికా అమ్మవారు మూలవిరాట్

గాలిగోపురం

ఆలయ గాలిగోపురం ఇటీవల నిర్మించారు. యలగాల గంగయ్య గారు పునాది వేయగా భక్తుల సహాయ సహకారాలతో సుమారు 50 లక్షల రూపాలయకు పైగా వ్యయంతో నిర్మించారు. ఐదు అంతస్తులు గల ఈ గాలిగోపురం ఎంతో ఆకర్షనీయంగా కనపడుతుంది. ఆలయ గోపురంను వివిధ రంగులతో అందంగా తీర్చిదిద్దారు. గోపురం పై పరివార దేవతలు, శైవ, వైష్ణవ దేవతామూర్తులు కొలువుదీరియున్నారు. వాస్తూరిత్యా ఆలయంలోని ప్రతి భాగం భగవంతుని శరీరభాగాలని ఆగమాలు చెబుతున్నాయి. ఆలయగోపురం అనేది భగవంతుని పాదాలుగా కీర్తించబడుతున్నాయి. గోపురంకు నమస్కారము చేస్తే భగవంతుని పాదాలకు నమస్కరించినట్లే. భక్తులు తప్పనిసరిగా ఆలయ గోపురానికి నమస్కరించి ఆలయ ప్రాంగణం లోనికి చేరుకోవాలి.

రుద్రగుండం(విభూదిగుండం)

పరశురాముడు శివలింగమును ప్రతిష్ఠించి, అభిషేకించుటకు జలము కోసమని రుద్రహోమం నిర్వహించిన ప్రాంతంలో ఒక కొలను నిర్మించి, ఆ కోనేరు జలమును దోసెట తీసుకోగ ఆనీరు మలినంగా ఉండుట గమనించిన పరశురాముడు ఓ పరమేశ్వరా ఈ రుద్రగుండమున ఉన్న ఈ నీరు మురికిగా ఉండుట నాకును, నీకును అపకీర్తియే. కావున ఈ రుద్రగుండం విభూదిగుండమై ఇందులో స్నానమాచరించి, ఈ విభూదిని ధరించి, నిన్ను సేవించు భక్తులు అరిషడ్వర్గములను జయించి సుఖసంతోషాలతో జీవించునట్లు వరము ఇవ్వమని పరమేశ్వరుడ్ని కోరెను. అందుకా స్వామి తథాస్తు అని దీవించగా, రుద్రగుండంలోని నీరు గంగానది జలము వలే స్వచ్ఛంగా విభూదిరంగులోకి మారెను. అప్పుడా జలముతో పరశురాముడు స్వామిని అభిషేకించెను. అప్పటి నుండి ఈ గుండమునకు రుద్రగుండమని (విభూదిగుండం)అని పేరు. విభూది(విభూతి) అనగా హోమంలో దర్భలు, ఇతర హోమ వస్తువులు దహించగా మిగిలిన భస్మాన్ని విభూది అని అంటారు.

వేదములు, పురాణములు ఏకకంఠముతో విభూది యొక్క మాహిమను చాటుచున్నవి. భస్మ(విభూది) స్నానము చేసినవారు సర్వతీర్థాలు చేసినవారితో సమానము. విభూది ధారణ చేసిన వారికి దుష్ట గ్రహములు, పిశాచములు, సర్వరోగములు, పాపములు సమీపించవు. ధర్మబుద్ధి, బాహ్య ప్రపంచ జ్ఞానం కలుగును. విభూది నొసట ధరించి “శివపంచాక్షరి” మంత్రము ప్రతిదినము పఠించు వారికి స్వర్గలోక ప్రాప్తి కలుగును. ఆలయం ఎదుటనున్న విభూదిగుండంను రుద్రహోమం చేసిన ప్రాంతంలో తవ్వటంచేత కోనేరు అడుగు భాగంలో సుద్దతో తయారైన విభూది ఉండలు ఏర్పడుతుంటాయి.

భక్తులు ఈ విభూది కొలనులో స్నానమాచిరించి, విభూదిని ధరించి, స్వామివారిని దర్శించుకుంటారు. ఈ విభూది ఉండలను పరమ పవిత్రంగా భావించి భక్తులు తమ ఇండ్లకు తీసుకెళ్తుంటారు. ఈ గుండం 6 అడుగులు లోతుగల చతురస్రాకారములో ఉంటుంది.

ఈ కోనేరులో వర్షాకాలం, వేసవి కాలాలలో ఒకే విధంగా ఎల్లప్పుడు ఒకటిన్నార అడుగు లోతు నీరు ఉంటుంది. ఈ కోనేరు మధ్య భాగాన ఒక చిన్న మందిరం, అందు ఒక శివలింగం కలదు. ఈ శివలింగానికి ఎదురుగా పశ్చిమాభిముఖముగా ఒక నందీశ్వరుడు కలదు. ఈ నందీశ్వరవిగ్రహం ఏనాడు మునగదటా!. కోనేరు నీరు బయటకు వెళ్ళు తూమును కోనేరు నందు పూరెడి జలమునకు సమానంగా నిర్మించారు. అయితే ఈ ఆలయం పక్కన కెసిపి సిమెంట్ ఫ్యాక్టరీ వారు మైనింగ్ చేయుట వలన ఈ గుండంలో నీరు ఉండట లేదు.

విభూదిగుండం (రుద్రగుండం)

గోవు గర్భము

శ్రీ సిద్ధేశ్వరస్వామి దేవాలయం ఉత్తరదిక్కు గోవుగర్భమనే మందిరం కలదు. ఆ మందిరంకు సన్నని ప్రవేశద్వారం(కంత) వున్నది. జాన వెడల్పు, మూరకు పై ఎత్తులో ఆ కంత ఉంటుంది. చిన్న కోనేరు పై నిర్మించిన ఈమందిరంను గోగర్భమని పేరు. దీనిని భక్తులు పరమపవిత్రంగా భావిస్తారు. కోనేరులో ఎప్పుడు అడుగున్నర నీరు వుంటుంది. సహజ సిద్ధంగా నీరు ఊరే ఈ కొలనులో స్నానమాచరించితే సకల పాపాలు తొలిగిపోతాయని భక్తుల నమ్మకం.

రుద్రగుండం (విభూదిగుండం) నందు స్నానమాచరించిన భక్తులు గోగర్భం కు ఉన్న సన్నని కంత(ప్రవేశద్వారం)గుండా భక్తులు కోనేరులో దిగి, మెట్ల ద్వారా పైకి వచ్చి, ఆలయ ఉత్తర ద్వారం గుండా లోపలికి ప్రవేశించి , శ్రీసిద్ధేశ్వరస్వామి వారిని దర్శించుకుంటారు. శ్రీసిద్ధేశ్వరస్వామిని తలుచుకుంటే ఎంతటి స్థూలకాయుడైన విచిత్రంగా ఆ చిన్న ద్వారం గుండా బయటకు వస్తారు. ఈ గోగర్భద్వారం ద్వారా స్వామి వారిని దర్శించుకుంటే తల్లిగర్భం నుండి శిశువు ఎంతటి స్వచ్ఛంగా ఉద్భవిస్తాడో, సకలపాపాలు తొలిగి, అంతిటి స్వచ్ఛంగా నూతన జీవితం కొనసాగించవచ్చునని భక్తుల నమ్మకం. అలానే కోరుకున్న కోర్కెలు తీరి, సంతానం లేని మహిళలకు సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

ఈ గోగర్భం ఇచట ఉండుట కారణమేమనగా త్రేతాయుగమనందు తేరాల గ్రామం వద్ద నున్న పరశురాముడు తండ్రి జమదగ్ని మహర్షి ఆశ్రమానికి ఒకనాడు షట్చక్రవర్తులలో ఒకరైన కార్తవీర్యార్జునుడు వస్తాడు. జమదగ్ని వద్దనున్న సకలకోరికలు తీర్చే కామధేనువు సంతతికి చెందిన సురభి అనే గోమాత పై ఆశపడతాడు. ఆగోవును తనకు ఇమ్మని కార్తవీర్యార్జునుడు అడుగగా, ఇచ్చుటకు నిరాకరించిన జమదగ్నిని సంహరించి, ఆ గోవును బలవంతంగా తోలుకుపోతాడు. ఈ పాపానికి పాల్పడ్డాడు కనుకనే తేరాల శ్రీ సిద్ధేశ్వరాలయ ప్రాంగణమందు గోగర్భము వున్నది.

శివసాయుజ్యాన్నిచ్చే క్షేత్రం

శివసాయుజ్యం కోరి ఆత్మార్పణం(దేహత్యాగం) చేసుకోవటానికి వీరశైవ భక్తులు తేరాల శ్రీసిద్ధేశ్వరస్వామి క్షేత్రంను ఎంచుకునేవారనటానికి చారిత్రక ఆధారాలు ఉన్నాయి. అలా ఆత్మార్పణ చేసుకున్న వీరమహేశ్వరుల శిలలను ఆలయ ప్రాంగణంలో ప్రతిష్టించేవారు. అలా దేహత్యాగం చేసిన వీరగల్లు శిలలు శ్రీసిద్ధేశ్వరక్షేత్రంలో కలవు.

1. ఆలయ ఉత్తరదిక్కున ఉన్న గోగర్భ మందిరం ప్రవేశద్వారం వద్ద దక్షిణ ముఖమై ఒక వీరగల్లు ఉన్నది. ఒక వీరశైవ భక్తుడు కుడిచేతిలో కత్తిని పట్టుకుని తన తలను ఖండించి, ఎడమచేతితో ఖండిత తలకున్న ముడివేసిన జుట్టు పిలకను పట్టుకుని శివలింగమునకు నైవేద్యంగా అర్పిస్తున్నట్లు కలదు. ఈశిల పై భాగంలో ఆత్మార్పణ చేసుకొని స్వర్గానికి చేరి పద్మాసనంలో కూర్చుని ఉన్న ఆ భక్తునికి దేవకన్యలు అభిషేకిస్తున్నట్లు కలదు. ఆ భక్తుడు చేతులకు, మెడకు రుద్రాక్షలు ధరించియున్నాడు.

2. అలానే దేవాలయ ముఖమండపం, అంతరాళం ద్వారబందం కుడివైపున పడమర ముఖమై మరొక వీరగల్లు కలదు. ఓ శైవభక్తులు కుడిచేతితో కత్తి పట్టుకుని, తన పొట్టభాగంలో పొడుచుకున్నట్లు, ఎడమచేతిలో శివలింగమును పట్టుకొని, ఆత్మార్పణ చేసుకున్న ఈ భక్తుని మెడలో శివలింగం, చేతులకు, మెడలో రుద్రాక్షలు ధరించి, మీసాలుపైకి మెలితిప్పి ఉన్నది.

3. సిద్దేశ్వరస్వామి ఆలయానికి-రూపులమ్మగుడి మధ్య కానువాగు ఉన్నది. వాగు ఒడ్డున విరిగిన చిన్న రాతిశిల పడిఉంది. ఆ శిలనందు ఒక చేయి పైకి లేచి 'ఆగుము' అన్నట్లు ఉన్నది. ఆ చేతికి గాజులు ఉన్నాయి. ఇది సతి శిల. తన భర్త మరణించిన తరువాత ఆ స్త్రీ సతిసహగమనం చేసినట్లు ఈ శిల ద్వారా తెలుస్తుంది. ఆరు సంవత్సరాల క్రిందట తీసిన ఈశిల ఫొటో నా దగ్గర పోయింది. తిరిగి ప్రయత్నించగా ఆప్రాంతమంతా దట్టంగా తుమ్మచెట్లు పెరిగి సతీశిల కనిపించలేదు.

వెయ్యి సంవత్సరాల క్రిందట ఇలా ఎందరో వీరశైవ భక్తులు శ్రీసిద్ధేశ్వర క్షేత్రం నందు ఆత్మార్పణం(దేహత్యాగం) చేసుకొని, శివునిలో ఐక్యమైనారని తెలుస్తుంది. ఆరోజుల్లో ఆత్మార్పణ వంటి అతిపవిత్ర కార్యం ఈ ఆలయంలో జరిగేవంటే, ఇక్కడి శ్రీసిద్ధేశ్వరస్వామి ఎంతటి ప్రసిద్ధమో అర్థమవుతుంది.

తన తలను కత్తితో ఖండించి శివలింగమునకు అర్పిస్తున్న వీరమహేశ్వరుడు. స్వర్గానికి చేరిన ఆ భక్తుడిని అభిషేకిస్తున్న దేవకన్యలు



కత్తితో పొట్టలో గుచ్చుకుని దేహత్యాగం చేస్తున్న వీరమహేశ్వరుడు



రూపులమ్మగుడి సమీపంలో కానువాగు ఒడ్డున గల సతీ శిల ఊహా చిత్రం

వీరగల్లు

కల్లు అంటే కన్నడంలో రాయి అని అర్థం. వీరగల్లు అంటే వీరుల స్మృత్యర్థం నిలబెట్టిన రాళ్లు. వీటినే ఇంగ్లీష్ లో హీరో స్టోన్స్ అంటారు. వీరగల్లులు మధ్యయుగం నాటి సామాజిక జీవితానికి, సంస్కృతికి, మతవిశ్వాసాలకు సజీవ సాక్ష్యాలు. యుద్ధ రంగంలో, దొంగలు, దోపిడీదారుతూనో, గోవుల్ని కాపాడేందుకు, క్రూర మృగాలను వేటాడతూనో, అడవిపందుల నుండి పంటలను కాపాడటానికి, గ్రామ రక్షణ కొరకు కంకణ బద్ధులై మరణించిన వీర పురుషుల, వీరవనితల స్మారకార్థం వీరగల్లులు గ్రామాల్లో ఏర్పాటు చేస్తారు. వీరగల్లులు సహజంగా గ్రామ శివాలయాలు, దుర్గ, భైరవ, వీరభద్ర ఆలయాల వద్ద, చెరువుల వద్ద ముఖ్యంగా అందరికి కనపడేవిధంగా ప్రతిష్ఠింపబడి ఉంటాయి. చాలా మటుకు వీరగల్లులలో వీరులు కత్తి / విల్లు / బాకు పట్టుకున్నట్టుగా చిత్రీకరిస్తారు. అది వారి పోరాటానికి వీరత్వానికి ప్రతీక. కొన్ని వీరగల్లులలో అశ్వారూఢులైనట్లు ఛత్రం పట్టి ఉంటుంది. అది ఆ ప్రాంత రాజును సూచిస్తుంది. ఇటువంటి వీరగల్లు మాచర్ల రామప్పగుడి ప్రాంగణంలో కలదు.

అలానే మధ్యయుగంలో కర్నాటక నుండి వచ్చిన వీరశైవం ఇక్కడ విపరీతంగా వ్యాప్తిచెందినది. శివసాయుజ్యం కోసం తమ శరీరంలోని అంగాల్ని కోసుకొని ఆత్మార్పణం (ప్రాణత్యాగం) చేసుకునే ఆచారం పుట్టుకొచ్చింది. వీరశైవం ఉధృతంగా ఉన్న కాలంలో ఎందరో వీరశైవులు శివసాయుజ్యం కోరి ఆత్మార్పణ చేసుకున్నారు. వీరికి వీర మహేశ్వరులని పేరు. వీరి త్యాగ శిలలు కూడా వీరగల్లుల్లో చేరాయి.

ఈ శిలలను సులువుగా గుర్తించవచ్చు. తమ తలపై ఉన్న శికముడిని ఒక చేతితో పట్టుకుని, మరోచేతిలో కత్తి ధరించి, తమ మెడలను తెగకోసుకుంటున్నట్టుగా, కత్తితో పొట్టలో పొడుచుకుంటున్నట్లు, రెండుచేతులతో కత్తులు ధరించి మెడలో గుచ్చుకుంటున్నట్లు, గండ కత్తెర (మాచర్లలో యాదవుల బజారు వీరభద్రునిగుడి నందు కలదు) వేసుకుని మరణించిన వారు, కొండ పై నుంచి దూకిన వారు. అగ్ని గుండాలలో ఆత్మాహుతి చేసుకున్నవారి విగ్రహాలను కూడా గమనించగలరు.

పరమ శివునికి ఆత్మార్పణ కావించడం అనేది అంత సులభమైన విషయం కాదు. ఏఒక్కరికో ఈ అవకాశం లభిస్తుంది వీరశైవులు ఆత్మార్పణ చేసుకోవటానికి శ్రీశైలం, త్రిపురాంతకం వంటి పవిత్ర మహాక్షేత్రాలను ఎంచుకునేవారు. తేరాల శ్రీసిద్ధేశ్వరక్షేత్రం కూడా అంతటి పవిత్రక్షేత్రం కనుకనే భక్తులు ఈసిద్ధేశ్వరక్షేత్రంలో శివసాయుజ్యం కోసం ఆత్మార్పణలు చేసుకునేవారు.

శ్రీశైలంలో “వీర శిరో మండపం ” రెడ్డి రాజు అనవేమా రెడ్డి తండ్రి అన్నయ్య రెడ్డి పుణ్యం కోసం క్రీ.శ. 1378 లో కట్టించాడు . ఈ మండపం లోనే ఎంతో మంది వీర శైవ భక్తులు తమ నాలుకలను ,చేతులు ,కాళ్ళను ,శిరస్సులను ఖండించుకొని శివునికి అర్పించే వారని అక్కడి శాసనం తెలియ జేస్తోంది. ఈ విషయాన్ని తెలిపే చిత్రాలు శ్రీశైలం తూర్పు ప్రకారం పైన ఇప్పటికి మీరు చూడవచ్చు. త్రిపురాంతక ఆలయప్రాంగణలో అనేక వీరశైవుల వీరగల్లులు ఉన్నాయి.

ఈ కాలం లో ఇలాంటి సంప్రదాయాలు చట్టవిరుద్ధం నేరం కూడా. అయినప్పటికీ కొన్ని పండుగలు, శుభకార్యాల సమయాలలో నేటికి వీరశైవులు భక్తావేశంతో ఈటెలను తమ నాలుకలలోను, పెదవులలోను, కంఠంలోను, పొట్టలోనూ గ్రుచ్చుకొని ప్రదర్శన చేయటం జరుగుతుంది.

శివుడు దక్షయజ్ఞాన్ని హరించడమనేది వీరశైవం లో ప్రధాన అంశం. దక్షయజ్ఞం సమయం లోనే వీరభద్రుడు ఉద్భవించాడు. వీరభద్రుడు లేకుంటే దక్షయజ్ఞ హరణం అనేదే లేదు. వీరశైవ మతానికి ఇదే పునాదిగా చెప్పవచ్చు. భక్తావేశంలో ఆత్మార్పణ చేసుకొవడం ఈ మతస్థుల్లో కనిపిస్తుంది.

జగద్గురు శ్రీ రేణుకాచార్య భగవత్పాదులు శ్రీ స్వయంభు సోమేశ్వర లింగం నుండి లింగోద్భవం చెంది పరమశివుడి ఆనతి మేరకు ఈ భుమండలంపైన శక్తివిశిష్టాద్వైతాన్ని స్థాపించడం జరిగింది. ఈ శక్తివిశిష్టాద్వైత సిద్దాంతాన్నే వీరశైవంగా పిలుస్తారు. రేణుకాచార్యులు అప్పటి వైదికమతాన్ని, ఆచారాలను త్రోసిపుచ్చుతూ బహుళ ప్రాచుర్యతకు నోచుకుంటున్న బౌద్ధ, జైన, చార్వాకాది మతాలను నిలువరింపజేసే క్రమంలో వీరశైవ మతాన్ని అందరూ ఆదరించే విధంగా తీర్చిదిద్దటం జరిగింది.

వైదిక మతాలకు ఆకర్షింపబడుతున్న హిందూదేశపు అంత్యకులాలవారిని అక్కున జేర్చుకోవటం జరిగింది.

శివునికే కాక ఇతర ఇష్టదైవమునకు తలకోసి యిచ్చే సాంప్రదాయం వున్నట్లు క్రీ.శ. 1066నాటి మాచర్ల చంద్రవంక వొద్దునగల వీరగల్లు శాసనం(ఎఆర్ నెం.448, 1938–39) ద్వారా తెలుస్తుంది. ఈ వీరగల్లు శాసనంలో స్థానిక పాలకుడు బిరుదు గామయ్య సైనికుడైన అచకుంజుడు గామయ్యకు విజయం చేకూరాలని తన తలను పద్లసాని దేవతకు అర్పించినట్లు కలదు.

అంతా శివమయం

తేరాల గ్రామమంతా శివమయంగా కనపడుతుంది. పరశురాముడు ప్రతిష్ఠించిన శ్రీసిద్ధేశ్వరస్వామి క్షేత్రం ప్రముఖ శైవ క్షేత్రంగా వెలుగొందుతుండగా, ఆలయ, గ్రామ పరిసరాలలో ఎటు చూచినా శివలింగాలు దర్శనమిచ్చును. కొంత మంది గ్రామస్తులకు పొలాలు దున్నుతుండగా శివలింగాలు బయల్పడ్డాయి. అలా బయట పడిన రెందు శివలింగాలను గ్రామ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద భద్రపరిచారు. మరొక శివలింగాన్ని ఒకరు వారింట్లో పూజిస్తున్నారు. అలానే గ్రామ చెంచుకాలనీ సమీపంలో చిన్న లోయలో ఒక శివలింగం వుండగా, ఇక్కడే మరోక శివలింగం పూడిపోయియున్నది. శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయానికి తూర్పుదిక్కున మల్లయ్య ఒడ్డు అను ఎత్తైనకొండ కలదు. దాని పై శ్రీమల్లీశ్వరస్వామివారి ఆలయమున్నది. ఆలయం శిథిలముకాగా, ఆలయం ఎదురు శిథిల స్థితిలో నందీశ్వరుడున్నాడు. పూర్వం ఈ మల్లీశ్వరస్వామికి అతివైభవంగా పూజాదికాలు, ఉత్సవాలు జరిగేవి.

ఈ ఆలయానికి చేరుకోవటానికి ఆనాడు కొండకు ఇరువైపున ఏర్పాటు చేసిన మెట్లు శిథిలమయ్యాయి. ఈ ఆలయానికి దక్షిణదిక్కులో ఒక శివలింగమున్నది. మల్లన్న గుట్టలు ఉత్తరదిక్కులో బ్రహ్మనాయుడు చెరువులో నాలుగు శిథిల శివాలయాలు వున్నాయి. అక్కడే ఒక పొలంలో శిథిల శివలింగం ఉన్నది. ఇక్కడ ఇన్ని శివలింగాలు వుండటం, దేవాలయాలు వుండటం చూస్తే ఈ ప్రాంతం ఒకప్పుడు గొప్ప శైవక్షేత్రంగా విరసిల్లినట్లుగా తెలుస్తుంది.

మల్లయ్య ఒడ్డు కొండ పై నున్న శిథిల శ్రీమల్లీశ్వరస్వామి వారి ఆలయం

తేరాల గ్రామ
పరిసరాలలో నున్న
శివలింగములు

అర్చకులు - ఉత్సవాలు

తేరాల భ్రమరాంబ సమేత శ్రీ సిద్ధేశ్వరస్వామి ఆలయంలో శైవాగమన ప్రకారం పూజాకైంకర్యాలు జరుగుతాయి. ఈ ఆలయ అర్చకులు విశ్వబ్రాహ్మణ (కంసాలి) కులస్థులు. హిందూ దేవాలయాల్లో ఎక్కువుగా బ్రాహ్మణ అర్చకులే ఉంటారు. పలనాడు ప్రాంతంలో అతికొద్ది హిందూ దేవాలయాలలో విశ్వబ్రాహ్మణ కులస్థులు కనపడతారు. శ్రీసిద్ధేశ్వరాలయంలో గత 60 సంవత్సరముల నుండి వీరు అర్చకత్వం చేస్తున్నారు. కటకం వెంకటేశ్వరశర్మ, మహేశ్వరపు బాలకృష్ణ, మహేశ్వరపు సిద్దేశ్వరాచార్యులు సంవత్సరానికి ఒకరు వంతు చొప్పున ప్రస్తుతం అర్చకత్వం చేస్తున్నారు.

శ్రీసిద్ధేశ్వరస్వామికి ఆలయంలో ప్రతి సోమవారం, ప్రతినెల మాసశివరాత్రి రోజున ప్రత్యేక పూజలు జరుగుతాయి. మహాశివరాత్రికి తొలి ఏకాదశికి ఇచ్చట ఘనంగా తిరునాళ్ళు జరుగుతాయి. తేరాల చుట్టు ప్రక్కల గ్రామాలైన మాచర్ల, మండాది, ఎర్రబాలెం, పట్లవీడు, రచ్చమల్లపాడు, పోలేపల్లి, ఆత్మకూరు, రాయవరం తదితర గ్రామాల నుంచే గాక ఇతర ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. శివరాత్రి రోజున ప్రభలు కట్టుకొని ఆలయానికి వస్తూంటారు. ప్రతి ఏడాది తేరాల గ్రామంలో గ్రామ ప్రభను తప్పనిసరిగా కడతారు. మిగిలిన వారు మ్రొక్కుబడులుగా ఎవరికివారే ప్రభలను కట్టుకుని సిద్ధేశ్వరాలయం చుట్టూ ప్రదక్షిణము చేయించి, జాగారం చేసి మ్రొక్కుబడులను చెల్లించుకుంటారు.

తేరాల గ్రామస్థులు పూర్వం నుండి ఈ భ్రమరాంబ సమేత శ్రీ సిద్దేశ్వరస్వామి పట్ల మిక్కిలి భక్తి కలవారై ఉండును. మహాశివరాత్రి నెలలో అనగా మాఘమాసంలో ఈ గ్రామ ప్రజలు మాంసాహారమును ముట్టరు. శివరాత్రి రోజున అతి నియమనిష్ఠలతో ఒక్క ప్రొద్దులుందురు. తమ సంతానికి కేశఖండనము చేయించెదరు. తమ సంతానానికి సిద్దయ్య, సిద్దమ్మ, సిద్ధి, శివయ్య, శంకరయ్య, చంద్రశేఖరం, శంకర్, మొదలగు శివుని పేర్లు ఎక్కువుగా పెట్టుకుంటారు.

రూపులమ్మ ఆలయం

ఎందరో మహారాజులు తమ పరిపాలన సమయంలో వారు పాటించిన మత ఆచారాలు, సంస్కృతి, సంప్రదాయాలు తదితర విషయాలకు గుర్తులుగా ఎన్నో అద్భుత కట్టడాలు, దేవాలయాలను నిర్మించారు. ఒక్కో కట్టడం ఒక్కో ప్రత్యకతను చాటుతుంది. ఒక్కో కట్టడం ఒక్కో రాజు చరిత్ర తెలుపుతుంది. అలాంటి కట్టడమే శ్రీసిద్ధేశ్వర స్వామి ఆలయానికి 500 మీటర్ల దూరంలో బ్రహ్మనాయుడు చెరువులో 8 అడుగుల మట్టిలో పూడుకు పోయివున్న రూపులమ్మ ఆలయం.

బాదామీ చాళుక్యుల ఉనికిని తెలిపే అపురూప కట్టడం ఈ రూపులమ్మ ఆలయం. తూర్పు చాళుక్య రెండవ విష్ణువర్థన మహారాజు పాలనలో ఈ ప్రాంతం ఉన్నట్లు ఆధారాలు ఉన్నాయి. శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో రెండవ విష్ణువర్ధనుడు క్రీ.శ.679నాటి శాసనం ఉండటం వలన ఈ గుడి నిర్మాణం అంతకు ముందే జరిగివుండవచ్చు. తూర్పు ముఖంగా ఉన్న ఈ గుడి గర్భాలయ ద్వారం పై కప్పు వరకు పూర్తిగా చెరువు మట్టిలో పూడుకుపోయివుంది. గర్భాలయం ఎదుట అంతరాళం ఉంది. దాని పై కప్పుకు ఉన్న రెండు పెద్ద బండపరుపులు పక్కలు తొలిగి ఉన్నాయి. అక్కడి నుండి చూస్తేనే మనకు గర్భాలయం ద్వారం పై వరకు మట్టిలో పూడుకుపోయినట్లు కనిపిస్తుంది.

గర్భాలయం పైన విమానం(ఆలయ శిఖరం) 20 అడుగుల ఎత్తులో శిథిల స్థితిలో ఉంది. గర్భాలయ శిఖరం పైన ట్రాక్టర్ టైరు సైజులో గుండ్రని రాతి చట్టు దాని పై మరొక పెద్ద రాతి చట్టు ఉండేది. దానిలో ఏవో నిధులు ఉంటాయని దుండగులు పగులగొట్టి శిఖరం పై నుండి క్రిందకు పడవేశారు. ఆ రాతి చట్ల శిథిలాలు ఆలయం పక్కనే ఉన్నాయి. ఈ ఆలయం చుట్టూ ప్రహరి వుండి వుండచ్చు. గుడి ఎదుట శిల్పాలు చెక్కియున్న ద్వారశాఖలు ఉన్నాయి. వీటి పై గణపతి, గజలక్ష్మీ, దూమపానం చేస్తున్న పరమేశ్వరుడు, దక్షిణామూర్తి తదితర శిల్పాలు ఉన్నాయి. ఇవి ఇప్పటికే శిథిలమైనవి, మరికొన్ని రోజులకు కనపడవు. ఇవన్నికూడా 7వ శతాబ్దం నాటివి.

పురావస్తుశాఖ వారు గుడి నిర్మాణ తీరు, శిల్పరీతిని పరిశీలించి, నాగరా శైలిలో నిర్మితమైన ఈ ఆలయం బాదామి చాళుక్యుల నిర్మాణమని తేల్చి తమ రికార్డుల్లో నమోదుచేశారు. ఈ ఆవిష్కరణ గుంటూరు జిల్లాలో బాదామి చాళుక్యుల మొదటి ఆనవాళ్ళుగా రికార్డులలో పొందుపరిచారు. ఆలయానికి 100 మీటర్ల దూరంలో ముఖ రూపం కోల్పోయిన విరిగిన బుద్ధుని శిథిల శిల్పం ఉన్నది. ఈ శిల్పం వద్దే అర్థపద్మాలు చెక్కి ఉన్న రెండు పాలరాతి స్తంభాలు శిథిలమైయున్నాయి. ఇక్కడ పూర్వం బౌద్ధచైత్యం ఉండివుండవచ్చును.

ఈ చెరువు మట్టి పూడులో ఎన్నో చారిత్రక కట్టడాల ఆధారాలు ఉన్నాయి. ఈ గుడి పరిసర ప్రాంతాల్లో త్రవ్వకాలు జరిపితే ఎన్నో చారిత్రక ఆధారాలు లభ్యమయ్యే అవకాశం వుంది. గతంలో ఈ ఆలయ నిర్మాణం పునరుద్దణకు రూ. 20లక్షలు పురావస్తు శాఖ మంజూరు చేశారని? అయితే ఆ పనులు చేపట్టలేదని సమాచారం. రూపులమ్మగుడిని గూగుల్ మ్యాప్ లో ఉత్తర అక్షాంశం $16^0 25' 46.3'$, తూర్పురేఖాశం $79^0 26' 05.3'$ నందు ఆలయమును చూడవచ్చు. 12వ శతాబ్ధంలో బ్రహ్మనాయుడు ఇక్కడ వున్న పెద్ద తటాకానికి గట్లు ఏర్పాటు చేయటం వలన, చెరువు విస్తీర్ణం పెరిగి ఈ చారిత్రక రూపులమ్మ ఆలయం ఆ చెరువులో పూడుకుపోయి ఉండవచ్చు.

మహాదేవి(రూపులమ్మ)

ఈ ఆలయంలో మహాదేవి(దుర్గ) అమ్మవారు కోలువై వుండేవారు. ఈ అమ్మవారి పేరుతోనే మహాదేవిచెర్ల (మాచర్ల) గ్రామం ఏర్పడింది. స్థానికులు అమ్మవారిని రూపులమ్మగా పిలిచేవారు. రాబెర్ట్ స్వేల్ అనే ఆంగ్లేయుడు తేరాల గ్రామ శివారులో ఉన్న ఈ ఆలయాన్ని సందర్శించి, 1882 లో ప్రచురితమైన లిస్ట్ ఆఫ్ ది ఆంటిక్వారియన్ రిమైన్స్ ఇన్ ది ప్రెసిడెన్సీ ఆఫ్ మెద్రాస్ పుస్తకమునందు ఈఆలయం గూర్చి రాసియున్నారు. ఈ తరహా కట్టడం ఈ ప్రాంతంలో ఇదే మొదటిది కావచ్చునని, ఈ ఆలయ గర్భాలయంలో 18 చేతులతో అమ్మవారి(దుర్గ) శిలావిగ్రహం ఉన్నదని తెలిపారు.

రూపులమ్మగుడి నిర్మాణశైలి గల ఆలయాలు శ్రీముఖలింగం(శ్రీకాకుళం జిల్లా), సత్యవోలు(ప్రకాశం జిల్లా), అలంపురం (తెలంగాణ)లో ఉన్నాయి.

రూపులమ్మ గురించి ఒక కథ ప్రచారం ఉన్నది. పూర్వం ఒక గాజుల వ్యాపారి తేరాల గ్రామంలో వ్యాపారం ముగించుకొని తిరిగి వెళుతూ పొద్దుపోవటంతో రూపులమ్మ ఆలయం వద్ద బస చేశాడట. ఆ వ్యాపారి తెల్లారేసరికి రక్తం కక్కుకొని చనిపోయి ఉండటంతో గ్రామస్థులు భయపడిపోయారు. రూపులమ్మ బలినికోరే అమ్మవారని తలచి కొందరు గర్భాలయంలోని విగ్రహన్ని పెకిలించారు. ఇప్పటికీ భక్తులు ఈ ఆలయం వద్ద పసుపు, కుంకుమ, గాజులు సమర్పించి పూజలు చేస్తారు. గాజులు సమర్పించటానికి గుడిసమీపంలో గాజులు తొడిగిన చేతి శిల్పం(సతిశిల)కు ఏమైన సంబంధం ఉందేమో తెలియదు.

బ్రహ్మనాయుడు చెరువులో శిథిల రూపులమ్మ గుడి శిఖరం

రూపులమ్మ గుడి శిథిలాలు

చెరువు మట్టిలో గర్భగుడి ద్వారం పై వరకు పూడుకుపోయిన దృశ్యం

రూపులమ్మగుడి ఎదుట నున్న శిథిలాలు, కానువాగు ఒడ్డున గల విరిగిన బుద్ధుని శిల

తేరాల గ్రామ చరిత్ర

శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయ క్రీ.శ. 679నాటి తూర్పు చాళుక్య విష్ణువర్ధనమహారాజు శాసనంలో తేరాల గ్రామ ప్రస్తావన ఉంది కనుక 1500 సంవత్సరాల క్రితమే తేరాల గ్రామం ఉన్నట్లు తెలుస్తుంది. అయితే పూర్వ తేరాల గ్రామం శిథిలమై అదృశ్యమై వందల ఏళ్ళ తరువాత బ్రిటీష్ వారి పాలనలో పూర్వ తేరాల గ్రామ శిథిలపాటిపైనే అదే పేరుతో ప్రస్తుత తేరాల గ్రామం పునర్నిర్మాణం జరిగింది.

300 సంవత్సరాల క్రితం లక్కరాజుగార్లపాడు నుంచి యాదవులైన పుచ్చకాయల ఇంటి పేరు గల వారు ఇక్కడకు వలస వచ్చారు. పూర్వం జువ్వలకల్లు అని పిలవబడే నేటి జూలకల్లు గ్రామం వద్ద మేకల మేపు కోసం విడిదిచేయగా, ఆ గ్రామ కరణం మాచర్ల వద్ద తేరాల అనే శిథిల గ్రామం వున్నదని, అక్కడ వేసవిలో సైతం నిరంతరం నీరు, పశుగ్రాసం అందుబాటులో ఉండి, నివాసయోగ్యమని చెప్పెను. దాంతో పుచ్చకాయల వారు ఇక్కడికి చేరుకుని, తేరాల శిథిలపాటిపై గ్రామాన్ని పునర్నిర్మాణం చేసుకున్నారు.

తేరాల గ్రామంలో ప్రాచీన సీతారాములు, ఆంజనేయస్వామి వార్ల ఆలయాలు కలవు. గ్రామ జనాభా 2160, మహిళలు కంటే పురుషులు 80మంది అధికం. యాదవ, మాల, మాదిగ, కమ్మ, రెడ్డి, చెంచు, తెలగ, ముస్లిం తదితర కులాలవారు ఉన్నారు. గూగుల్ మ్యాప్ లో ఉత్తర అక్షాంశం $16^{0}24'58.1$ తూర్పురేఖాశం $79^{0}26'25.1$ నందు చూడవచ్చు. గుంటూరు నుంచి 130 కి.మీ దూరంలో ఉన్నది. సమీప మాచర్ల రైల్వేస్టేషన్ 10 కి.మీ. దూరంలో ఉన్నది. గ్రామానికి చేరుకోవటానికి మాచర్ల, దుర్గి నుంచి ఆటోలలో ప్రయాణం చేయాలి.

తేరాల గ్రామంలోని ఒక బజారు

ఆదిమానవుల నివాసప్రాంతం

కాలగర్భంలో కలిసిపోయిన ఆదిమానవుల చరిత్రకు సజీవ సాక్ష్యం ఈ గ్రామం. మానవ చరిత్ర మహోన్నతమైంది. కాలంతోపాటు వేల సంవత్సరాల పాటు మానవ పరిణామ క్రమంలో జరిగిన మార్పులు అపారమైనవి. నేటి నాగరిక జీవనానికి పూర్వం ఆదిమానవుల జీవన విధానం ఎలా ఉండేది ఇక్కడి ఆదిమానవుల సమాధులు ద్వారా తెలుస్తాయి. నవీన శిలాయుగానికి చెందిన మానవులు తేరాల గ్రామ పరిసరాలలో ఉన్నట్లు ఆధారాలు ఉన్నాయి.

గ్రామ శివారు ప్రాంతం మల్లన్న గుట్టలుపై ఆదిమానవుల సమాధులు ఉన్నాయి. ఇవి మెగాలిథిక్ సమాధులు. వీటిని కైరన్ సిస్తులంటారు. చుట్టూ రాతిగుండ్ల బంతి, మధ్యలో రాతిపలకల పెట్టెసమాధి. క్రీ.పూ. 2500 సం.ల నుంచి క్రీ.శ. 300సం.ల నాటి సమాధులు ఇవి. వీటిని ఇనుపయుగం సమాధులని అని కూడా అంటారు.

వందకుపైగా పెదరాతియుగం సమాధులున్నాయి. వీటిలో ఎక్కువగా బంతిరాళ్ళతో నిర్మించిన సమాధులు, కొన్ని మూతరాళ్ళతో, మూతరాళ్ళు లేకుండా నిర్మించిన సమాధులున్నాయి. మరికొన్ని బంతిరాళ్ళ కైరన్లు, రాళ్ళ కుప్పలులేని బంతిరాళ్ళ సమాధులు. కొన్ని సమాధులకు నాలుగు దిక్కులలో నాలుగు రాతి పలకలు నిలిపి వున్నాయి.

గ్రామ సమీపంలోని మల్లయ్య ఒడ్డు, జమ్ములబోదు వద్ద సుమారు 50 వరకు మెగాలిథిక్ సమాధులు లేదా రాకాసిగూళ్లు ఉన్నాయి. గతంలో రోడ్డు కోసం తవ్వినప్పుడు కొన్ని సమాధులు బయల్పడ్డాయి. వాటిలో ఎముకలు, వివిధ సైజులలో నల్ల, ఎర్ర రంగు కుండలు, రంగు పూసలు బయటపడ్డాయి. గ్రామానికి తూర్పువైపు బతిరాళ్ళ సమాధులు ఉన్నాయి. ఇక్కడి పొలాల్లో దున్నె సమయంలో ఇప్పటికీ నలుపు, ఎరుపురంగుల్లో కుండపెంకులు బయటపడతాయి. కొన్ని కుండ పెంకుల పై గీతలు ఉన్నాయి. ఇక్కడి పొలంలో దొరికిన కుండపెంకులను నేను (పుస్తక రచయిత)సేకరించాను. జమ్మలబోదు ప్రాంతంలో ఆదిమానవులు రాతి చట్టులపై రోలు వాడిన ఆధారాలు ఉన్నాయి.

కొత్త రాతియుగం ఆదిమానవుడు ఎక్కడకు వెళ్ళినా గుంపులుగా వెళ్ళేవారు, గుంపులుగా జీవించేవారు. వీరికి పునర్జన్మపై నమ్మకం ఎక్కువ. ఎవరైనా చనిపోతే వారు తిరిగి జన్మిస్తారనే నమ్మకంతో పెద్దకుండలో పెట్టి భూమిలో పాతిపెట్టేవారు. పాతి పెట్టిన శవాన్ని ఏ జంతువూ పీక్కు తినకుండా వాటిచుట్టూ ఖచ్చితమైన వృత్తాకారంలో బండరాళ్లను నిలబెడతారు. వాటిపై కప్పుగా పెద్ద బండరాళ్లు పెడతారు. పెద్ద బండరాళ్లతో నిర్మించిన ఈ సమాధులు క్రీస్తు పూర్వం 2000 సంవత్సరాల నుంచి క్రీస్తు శకం 500 నాటివిగా చరిత్రకారులు చెబుతారు.

ఇక్కడున్న అనేక సమాధులు పాక్షికంగా దెబ్బతిని,మరికొన్ని పూర్తిగా శిథిలమైనాయి. స్థానికులు సమాధులపై ఉన్న బండలను పగులకొట్టి నాపరాయి కింద వాడుకున్నారు. మరికొందరు వీటిలో ఏవో ఉంటాయని ధ్వంసం చేశారు. కొందరు పొలాలు చేసుకున్నారు. ఇలా మరెన్నో సమాధులు కాలగర్భంలో కలిసిపోయాయి.

మల్లన్న గుట్టపై ఇనుప యుగం నాటి ఆదిమానవుల బంతి రాళ్ళ సమాధులు, మధ్యలో రాతి పెట్టెలు

గ్రామానికి తూర్పున ఇనుప యుగం నాటి ఆదిమానవుల వరస బంతి రాళ్ళ సమాధులు

ఆదిమానవుల సమాధులు అన్వేషణలో రచయిత పావులూరి సతీష్‌బాబు

కాను వాగు

బ్రహ్మనాయుడు చెరువు(పెద్ద చెరువు)కు ప్రధానంగా నీటిని అందించేది కానువాగు. ఈ కానువాగు నల్లమల అటవీ ప్రాంతంలోని నీటి ధారలు, గుడిపాడు చెరువు వెల్లువ, గంగలకుంట చెరువు వెల్లువ, రచ్చమల్లపాడు చెరువు వెల్లువ, ఊటలు కలిసి మండాది వెల్లువతో కలవడం వల్ల వాగు ఏర్పడుతుంది. ఈ కాను వాగు పెద్ద చెరువులో కలుస్తుంది. పూర్వం ఈ వాగులో కానుగ చెట్లు అధికంగా ఉండడం వల్ల దానికి ఆ పేరు వచ్చినట్లు ప్రతీతి.

బ్రహ్మనాయుడు చెరువు

మాచర్ల పట్టణ, పోలేపల్లి, తేరాల గ్రామ శివారులో, శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయానికి ఈశాన్య భాగమున బ్రహ్మనాయుడు చెరువు (పెద్ద చెరువు) కలదు. అప్పటికే పెద్ద తటాకంగా ఉన్న దానిని 12వ శతాబ్ధంలో మాచర్ల రాజధానిగా పరిపాలన చేసిన హైహయ వంశరాజు మలిదేవరాజు కాలంలో మంత్రి బ్రహ్మనాయుడు కట్టలు వేయించి పటిష్ఠపరిచాడలని ప్రతీతి. 692 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువుకు ప్రధానంగా నీటి వనరు కానువాగు ద్వారా అందుతుంది. మట్టి కట్టలతో నిర్మించుట వలన వరదలు సమయంలో ఈ చెరువు కట్టలు తెగిపోవడం వలన నీరు నిల్వ లేకుండా ఉండేది. దీనికి తోడు చెరువులో పూడిక పెరిగిపోయింది. దాంతో తేరాల గ్రామ ప్రజలు చెరువులోని కొంత భూమిని సేద్యంకు ఉపయోగించుకునేవారు. బ్రిటీష్ వారి పాలనలో చెరువుకు మరమ్మతులు చేసి, చెరువుకట్టను గచ్చుతో కట్ట నిర్మించి, చెరువును స్వాధీనపరుచుకున్నారు. ఆ సమయంలో ఒక ఎకరాకు రూ. 4 చొప్పున ధర నిర్ణయించి పొలాలను చెరువులో కలుపుకున్నారని గ్రామస్థులు తెలిపారు.

బ్రహ్మనాయుడు చెరువు కింద సుమారు 400 ఎకరాలు సాగు భూమి ఉంది. చెరువుకు నీటి లభ్యత 123 స్క్వేర్ కిలోమీటర్లు. 2.6 కిలోమీటర్ల సేద్యపు కాలువలుండగా 218 ఎకరాల రిజిష్టర్ ఆయకట్టు ఉంది. చెరువు నిల్వ సామర్థ్యం 95.448 మిలియన్స్ క్యూబిక్ ఫీట్స్ (ఎంసీఎఫ్‌టి). కరకట్ట పొడవు 570మీటర్లు. 165 మీటర్లు ఎడమ, 45 మీటర్లు కుడి కట్టల మధ్య 76 మీటర్ల కాంక్రీటుకట్ట ఉంది.

చెరువు మొత్తం 692 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. గూగుల్ ఎర్త్ మ్యాపులో $16^{0}24'58.1$ తూర్పురేఖాశం $79^{0}26'25.1$లో చూడవచ్చును.

బ్రహ్మనాయుడు చెరువు

చెరువు కట్టపై గల శక.1592 సౌమ్య కార్తీక శు 15 క్రీ.శ.1670వ సంవత్సరం కుతుబ్షాహీ వంశానికి చెందిన గోల్కొండ నవాబు అబ్దుల్లా పాదుషా కాలంనాటి శాసనం



దేవాలయ మాన్యములు

శ్రీసిద్ధేశ్వరస్వామి వారికి 37 ఎకరాలు, గ్రామంలోని శ్రీఆంజనేయస్వామివారికి 18 ఎకరాల65సెంట్లు భూమి కలదని, సాలీనా రూ.900 ఆదాయం వస్తున్నట్లు 1979లో దేవాదాయ ధర్మాదాయ శాఖ గుంటూరు జిల్లా వారు ప్రచురించిన గుంటూరు మండల దేవాదాయ ధర్మాదాయ దర్శనము అను పుస్తకం నందు కలదు. మాచర్ల గ్రామ నాయిబ్రాహ్మణ (మంగలి) కులస్థులు మాచర్ల వంశీయులకు భజంత్రీల మాన్యం 3 ఎకరములు భూమిని పూర్వం ఇచ్చియున్నారు. విశ్వబ్రాహ్మణులైన రాచకొండవారుకు కూడా మాన్యమున్నది. మాచర్ల వంశీయులు ప్రభల ఎదుట మేళము వాయించుట, రాచకొండవారు నైవేద్యము పెట్టి వీరాంగమాడుట నేటికి ఆనవాయితీగా జరుగుచున్నది.

అదృశ్యమైన రెండు గ్రామాలు

12వ శతాబ్ధంలో నిర్మించిన ఈ చెరువు లో మునిగిపోయి రెండు గ్రామాలు అదృశ్యమయ్యాయి. ఆయా గ్రామాల శిథిల ఆనవాళ్ళు నేటికి కనపడుతున్నాయి. చెరువు నిర్మాణం వలన కోమటిపేట, శంఖులమఠమనే గ్రామాలు ముంపుకు గురై అదృశ్యమవ్వగా, పూర్వ తేరాల గ్రామం కూడా అదృశ్యమైనది. దీనికి కారణం దోపిడి దొంగలు, కలరా వంటి వ్యాధులు, దట్టమైన అడవిలో ఉండటం వలన క్రూర మృగాల దాడుల వలన ఈ తేరాల గ్రామం అదృశ్యమవ్వటానికి కారణం అయివుండవచ్చును.

చెరువులో కాలక్రమేణ 10 అడుగుల వరకు పూడు పేరుకుపోయింది. చెరువు కట్ట దక్షిణం వైపున, సిద్ధేశ్వరస్వామి దేవాలయముకు తూర్పు భాగమున సిద్దయ్య గుట్టలుగా పిలువబడుతున్న ఈ ప్రాంతంలో 19వ శతాబ్ధంలో కొందరు గ్రామస్థులు పొలము సాగుచేయగా ఇక్కడ కొన్ని దేవాలయాల కట్టడములు, శిథిల పునాదులు, పురాతన కుండపెంకులు బయల్పడ్డాయి. దీనిని "కోమటిపేట"గా పిలుచుదురు. ఈగ్రామంలో వైశ్యులు ఎక్కువగా ఉండేవారట. ఇక్కడి పొలాల్లో తరచూ కుండ పెంకులుతో పాటు వెండి, బంగారం నాణేలు, వస్తువులు దొరుకుతుండేవి. ఈ గ్రామ దిగుడు బావి నేడు శిథిల స్థితిలో మనకు కనపడుతుంది.

ఈ కోమటిపేటకు తూర్పు వైపున పాటిచేలుగా పిలువబడే ప్రాంతం వున్నది. దీనిని "శంఖులమఠం" అని పిలిచేవారు. ఈ గ్రామంలో శైవ మతస్థులైన జంగము కులము వారు అధికంగా ఉండేవారట. ఇది సేధ్యపుభూమి ఈ ప్రాంతంలో 4 శిథిల దేవాలయ ఆనవాళ్ళు వున్నాయి. అనేక శివలింగములు, పానవట్టములు కలవు. కొన్ని వైష్ణవ శిలలు కూడా శిథిల స్థితిలో ఉన్నాయి. అప్పుడప్పుడు మట్టితో చేసిన నలువు, ఎరుపు రంగు పాత్రలు, కొన్ని రకాల పూసలు బయటపడతాయి. పూర్వం కొందరికి స్వర్ణ ఆభరణాలు దొరికినాయట. దుండగలు నిధుల కోసం తవ్వకాలు జరపటం మూలంగా ఈ ప్రాంతంలోని దేవాలయాలు పూర్తిగా శిథిలమయ్యాయి.

అలానే శంఖులమఠం దక్షిణ దిక్కులో నున్న పూర్వ తేరాల గ్రామం కూడా అదృశ్యమైనది. ఈగ్రామ శిథిలాల పైనే ప్రస్తుత తేరాల గ్రామం పునఃనిర్మితమైనది.

కోమటి పేట దిగుడు బావి

శంకులమఠం గ్రామ శిథిలాలు

బ్రహ్మనాయుడు చెరువులో పూడుకుపోయి అదృశ్యమైన కోమటిపేట, శంఖులమఠం గ్రామాల శిథిలాలు

ఆలయ శాసనములు

శాసనం 1

సిద్ధేశ్వరస్వామి దేవాలయంలో కొద్దిగా దెబ్బతిన్న, అసంపూర్ణంగా వున్న శాసనంలో సర్వలోకశ్రేయ విష్ణువర్ధనమహారాజు వ్యక్తిగత వ్యక్తులు క్రోంపాల నివాసితులైన లోకమయ్య అతని కుమారుడు జెట్టరయ్యాయు సిద్ధేశ్వరస్వామికి నూరు బంగారు నాణేలు, 118 పుట్టీల వరి పండే పొలమును మాన్యములను సమర్పించియున్నట్లును. ఇది క్రీ.శ. 679 బహుధాన్యనామ సంవత్సరం కార్తీక మాసమున శుక్ల పక్షము పంచమి ఆదివారం నాటిది. ఇది తూర్పు చాళుక్యుల కుటుంబానికి చెందిన రెండవ విష్ణువర్ధనమహారాజును సూచిస్తుంది. ఈ శాసనం ప్రాచీన తెలుగు భాషలో ఉన్నది. శాసనంలో గుణ్ణంబాడి(గుండ్లపాడు), తేరాల(తేరంబుల) గ్రామాల ప్రస్తావన కలదు.

ఆధారం: ఎస్.ఐ.ఐ.వ్యాల్యూమ్.40, నెం.100. ఎఆర్. బి.80 1930.



శాసనం

మొదటి వైపు

01. స్వస్తి. సవ్వ ౼ లోకశ్రీ
02. యశ్రీ విష్ణువర్ధ ౼ నమో
03. హారాజులకు ప్రవ[ర్ధ ౼ మా]
04. నవిజయరజ్య స[ం*]
05. వత్సర[ం*]బు ఌరు
06. రాజ్యాది ఏనగు
07. నేణ్డి బహుధన్య బ
08. న్నెణ్డి కత్తిక మాసంబు
09. న సుద్ధ పక్షంబున ప
10. ఇఛమియ మాదిత్యవా
11. రంబ నాణ్డు సిద్దీస్వర
12. ంబునగుణ్డ[ం] బాడి క్ట్లో
13. మ్పుల లోకమయ్యయి
14. జెట్టి రయ్యయి వి
15. డిచిన పసిణ్డిను
16. ఉుగద్యాణ[ం]బులు బ్ర
17. మ్పెసిణ్ణి యిచ్చి ఱె

రెండవ వైపు

18. కొ-చ-ర
19. -- వాలి(త్యు)-వ
20. ----
21. మి ------
22. ---చేను
23. బదినోఉు నిమి
24. ది పుట్లు యడ్లప
25. శే-ని సిద్దీస్వర[ంబు*]
26. నకు విడిచి నల
27. దీనికి అడము(?)
28. యిన వారు శ్రీప[వ్వ] [తం*]
29. బును [తేరంబుల]
30. [న]డిసినవారు
31. [త]అముల యచ
32. -- కొడుకు మకలి.

శాసనం 2

ఆలయ మండపం ఎదురు గల రాతిబంబడపై ఉన్న కాలం తెలియని శాసనంలో -(ఓ)రుంగల్లు సమీపంలోని మాచిరాజుపల్లికి చెందిన విభూదిగౌర అనే అతను శ్రీగిరి(శ్రీశైలం)లో నివసించే పండితరాధ్యా గృహంలో సేవకుడని కలదు.

ఆధారం: సౌత్ ఇండియన్ ఎపిగ్రఫీ వార్షిక నివేదిక 1929-30, బి స్టోన్ ఇన్స్క్రిప్షన్స్ కాపీయడ్ 1929-30.

శాసనం 3

కాకతీయ రాజగు దాయగజకేసరి బిరుదుగల నరేంద్రచక్రవర్తి అను పిలువబడే కుమార రుద్రదేవ మహారాజు(రెండవ ప్రతాపరుద్రుడు)పాలనలో, వీరి సర్వసైన్యాధిపతి సోమయాజుల రుద్రదేవ యొక్క బావమరిది రుద్రయ పెద్ది అర్ధోదయ పుణ్యకాలంనాడు, సిద్ధేశ్వరస్వామి దేవాలయ రుద్రగుండంలో స్నానమాడి, మగమాను సుంకమునూ తలారీ సుంకమును సిద్ధేశ్వరదేవరకు దీపారాధన నిర్వహణ కోసం ఇచ్చెను. ఇది శక. 1213 ఖర నామ సంవత్సర బహుళ సూర్యగ్రహణ కాలమందు అనగా అర్ధోదయ పుణ్యకాలంనాడు సోమవారం. క్రీ.శ. 1292 సంవత్సరం నాటిది.

ఆధారం: ఎస్.ఐ.ఐ.వ్యాల్యూమ్. 40, నెం. 102.

01. [స్వస్తి సమ*] ధిగ పంచ మహాశబ్దా
02. ద్రా - గజకేసరీ లాంఛనబ్రా -
03. [సకల?] దేశాధిపతియును నరేం[ద్ర*]
04. [చ*]కవత్తి॰యు - ను నైన శ్రీ కాకతి
05. [కు*]మార రుద్రదేవ మహారాజు
06. [దివ్య] శ్రీపాద పద్మారాధకుండు
07. సకల సైన్యాధిపతియును
08. [స*][ము]ద్దత ప్రతిపక్ష సమూహ[?]
09. హతోదాయ లక్ష్మీపతియు
10. [వి*]ఖ్యాత రాజనీతి చాణక్యుండును
11. తమిత సమ మధుర వాక్యుడుంను
12. పరచక్ర ప్రధా[ని] [నాయంకర] షాడ్గుణ్య
13. పుణ్యుండునుం[బర?]రిపు న్రిపశరణు
14. ండునుం బతిరాజ్య సముద్ధరణుండును



శాసనరాయి కాపీ

15. [జ]గద్భరిత కీర్తి విభూషణుండునునైన
16. శ్రీ సోమయాజుల రుద్రదేవయంగారి
17. కింబుణ్యముగాను వారి బావ రుద్ర[య]
18. పెద్దింగారు స్వస్తి[శక] వర్షంబులు 1213
19. గు ఖర సంవత్సర పుష్యబ[15అర్ధో ?] ద [య]
20. సూర్య్య గ్రహణ కాలంబున తేఊాల సిద్ధేశ్వర
21. ంబున రుద్రగుండంబున తీర్థ స్నానంబు సేసి
22. సిద్ధేశ్వర మహాదేవర దీపంబునకు ఆ
23. తేఊాలం గల మగమాను సుంకమూను
24. తలారికమును మరిని ఒంటెమి ఆయ[?న*]ము?
25. పేరను అదుగలేదు సర్వ మాన్యము[గా]
26. ధారాపూర్వ ము సేసి ఆ చంద్రర్క ము[గా]
27. నిచ్చె దీనికి యవ్వరు యెగ్గు దలించినాను
28. గంగ కఊతవేయు గవిలలం బోడిచి
29. న దోషమునం బందుదురు
30. సదమల ధర్మ్మ వతి విలసంనుత కీర్తి విలా[సి]
31. నీ మనో నిదన రతీశ మూర్తి గిరిశభ[క్తు]
32. -- । సదార్చన క్రమాతి ర్దమతి ధ
33. -కిందన యుందు దమ
34. -- -- లి దేవంశ్రీ--డి

చెరువు కట్టపై ఉన్న మరోక అస్పష్ట శాసనరాయి

శాసనం 4

ఈ శాసనం పల్నాడు విభజన అనంతరం మాచర్ల ప్రాంతాన్ని పరిపాలించిన హైహయవ రాజగు మల్లిదేవరాజుది. మహామండలేశ్వర మల్లిదేవరాజు తేరాల గ్రామమును సిద్ధేశ్వర దేవరకు ఇచ్చెను. దేవాలయ నిర్వహణకు మల్లికజియ్య అను ధర్మకర్తను నియమించెను. ఇది కాలం తెలియని శాసనం. బహుశా శక. 1079, క్రీశ. 1157 నాటిది కావచ్చును. 12వ శతాబ్ధంలో గురజాల రాజధానిగా పల్నాడును పరిపాలించిన నలగామరాజుకు సవతి కుమారుడు మలిదేవరాజుల మధ్య స్పర్థలు ఏర్పడి పల్నాడు రాజ్యం రెండుగా చీలిపోయింది. గురజాల రాజ్యానికి నలగామరాజు, మాచర్ల రాజ్యానికి మలిదేవరాజులు పాలకులుగా ఉన్నారు. మాచర్ల రాజ్య పాలకులుగా మలిదేవరాజు ఉన్నసమయంలో ఈ శాసనం వేయించి వుండవచ్చును. శాసనమ రాయి పై చంద్రుదు, సూర్యుడు, కత్తి, నిలబడియున్న ఆవు?, పానువట్టము పై శివలింగము ఉన్నాయి.

ఆధారం: ఎస్.ఐ.ఐ.వ్యాల్యూమ్.40, నెం.101. ఎఆర్. బి.81 1930

01. స్వస్తి శ్రీమన్మమ
02. హామణ్డలేస్వర
03. మల్లి దేవరాజు
04. సిద్ధీస్వరదేవర
05. కుతేఱాలు దా
06. రవోసి యిచె స
07. వ్వ॰ పరిహారము
08. దీని కెవ్వరేనింద
09. ప్పిన వారు గంగక
10. ఱ్ఱంగవులంబోడ్చి
11. చివార(రు) పరివా 12. [ర*] మ్ముపు మల్లిక
13. జియ్యలునఱ(?) వ (ప?)[ం*]
14. గలవారు.

మాచర్ల పాలకుడు మల్లిదేవరాజు శాసనం

శాసనం 5

ఈ శాసనం పల్నాడు పాలకుడు హైహయ వంశస్థుడు ఆత్రేయ గోత్రులు నలగామరాజుది. శ్రీమహామండలేశ్వర మైలమ కామరాజు (మైలమదేవి కుమారుడు కామరాజు అను నలగామరాజు) సిద్ధేశ్వరదేవర నైవేద్యమునకు తేరాల గ్రామంను ఇచ్చి, పన్నులు, శిస్తులు తదితర వాటిని ఇచ్చెను. నిర్వాహణకు చంద్రశేఖరుల కుమారుడు త్రిపురజియ్యను నియమించెను. కాలం తెలియని ఈ శాసనం క్రీశ. 1156 నాటిది కావచ్చు?. శాసన బండరాయి పై చంద్రుడు, సూర్యుడు, పానువట్టము పై శివలింగము, కూర్చున్న నంది, నిలబడియున్న ఆవు?, కత్తి చెక్కబడియున్నాయి.

ఆధారం: ఎస్.ఐ.ఐ.వ్యాల్యూమ్.40, నెం.98. ఎఆర్. బి.78 1930

01. సస్తి సమధిగత పంచమ
02. హా శబ్ద మహా మండలేశ్వర
03. అనేకోత్తుంగ్గ తర[ం]గ సంఘా
04. త లవణోదధి వేళావల
05. య వళయిత గంగా పయ్యౕం
06. త మద్ధ్యదేసాధీస్వర మహేస్వర
07. పురవరేస్వర నైహాయ వంశో
08. ద్భవ నాత్రేయ గోత్ర పవిత్ర న
09. త్యుగ్ర నరసిర దప్పౕణ ధ్వజ
10. మాప్పుఅ గోషణ సహస్ర
11. బాహు ప్రతాప వీరగుణ స
12. న్న(?)డ (?)వ (?) శ్రీ మన్మహామండ ళే
13. స్వర మఇలలదేవి కామరజు
14. తెఱల సిద్ధ్వేస్వర దేవరకు నయి[వే*]
15. ద్యము దివ్యెకు సవ్వ (ౕ) పరియరము
16. కాను తేఱల ఇచె చంత్రసేకరు
17. కొడుకు [త్రి] పురజియ నడంప
18. గలవాండు దీని ఎవ్వరు కొన్నా
19. గంగకఱుత్త వేక(గ) విలల పొ
20. డిచిన పపము తన పెద్ద(కొ)
21. దుకు కపలన కుడిచిన వరు



పల్నాడు పాలకుడు నలగామరాజు శాసనం

శాసనం 6

కంచరి పరిటాల గొంకినేని మనమడు పోతినేని త్రిపురనాయుడు తేరాల గ్రామ పడమట, రేగికుంట వెనుక, పెద్దచెరువు వెనుక పడమట 2 పుట్టీల భూమిని సిద్ధేశ్వర స్వామికిచ్చెను. ఈ శాసనం శక. 1165 శోభన నామ సంవత్సర ఫాల్గుణ మాస బహుళ అష్టమి గురువారం అనగా క్రీ.శ. 1243 మార్చి 15 నాటిది. ఈ సమయంలో పల్నాడు కాకతీయుల ఆధీనంలో ఉన్నది. కానీ వారి ప్రస్తావన శాసనంలో లేదు.

శాసనము రాయి పై పానువట్టము పై చంద్రుడు, సూర్యుడు, శివలింగము, శివలింగము ఎదురుగా నంది చెక్కబడియున్నాయి.

ఆధారం: ఎస్.ఐ.ఐ.వ్యాల్యూమ్.40, నెం.97. ఎఆర్. బి.77 1930

01. స్వస్తి శ్రీ శకవ
02. రుశంబులు 11
03. 65 అవునేంటి
04. శోభక్రితు సంవ
05. త్సర ఫాల్గుణబూ గు
06. కంచరి ప(?)రిటల గొం
07. కినేని మనుమండు పో
08. తినేని త్రిపిర నాయుండు
09. తేఱాల సిద్ధ నాథ దేవర
10. కు ఆయూరి పదు(మ*)
11. టి పొలానం బెటిన(ప్రి*)
12. త్తి చెలుగడు । ఖ 2 (నీ*)
13. రు నేల రేంగుకుంట వె
14. నక దూబమఱుతులు 1
15. ఆ పెద్ద చెఱువు వెన్క
16. బ్రాంహ్మన చేల పదు
17. మట మఱుతులు 1
18. స్వదత్తంద్విగుణం

శాసనము ముందు భాగము

శాసనం 7

శ.క.1366 సం॥ రుధిరోద్గారి నామ సంవత్సర మాఘ మాసము చతుర్దశి మహాశివరాత్రి పుణ్యకాలం నాడు అనగా క్రీ.శ. 4-2-1444న సోమవారం నాడు తేరాల గ్రామం వద్ద వున్న భూమిని సిద్దేశ్వర స్వామి వారికి శ్రీ మహామండలేశ్వర జగన్నాథ దేవరకు పుణ్యంగాను, అతిని సేవకుడు మానేపల్లి యఱమంద అను అతను వరి పండే భూమిని దానమిచ్చెను. శాసనము రాయిపై శివలింగము చెక్కబడియున్నది.
ఆధారం: ఎస్.ఐ.ఐ.వ్యాల్యూమ్.40, నెం.99. ఎఆర్.నెం. బి.79 1930.

01. [శ్రీ]శక వరుషంబులు 1366 యి
02. -- రోద్గారి సంవత్సర మా[ఘ]-
03. 15 ఆ శివరాత్రి పుణ్యకాలంనాడు
04. శ్రీ మన్మహామండలేశ్వర జగనాథదేవ
05. మహారాజులకు పుణ్యంగాను దేవరబంటు మ
06. [నే]పల్లి యఱమంద తేఱాల సిద్దేశ్వర దే[వ*]రకు బె
07. --తి చేను వెలివొలం వరిమడి కలంత
08. --- త్రియంకటము కాని కాగుగిళు నామ
09. బ్రాలు సహితంగాను అష్టబోగ తేజస్వామ్య
10. ంగాను దేరకు పుణ్యంగాను ఆ చంద్రా[ర్క]ం
11. -గానుయిస్తిమి ఇందుకు దకు నెవరు త(ప్పి)
12. కానాను గంగకఱుతను గోవును చంపిన
13. దోషాన పోవుదురు
14. స్వదత్తాం పరదత్తాం వా

దేవాలయ నిర్వహణ

శ్రీసిద్దేశ్వరస్వామి దేవాలయం ఎందరో రాజులు మాన్యములు, ఆభరణములు సమర్పించెను. రాజులు ఇచ్చిన మాన్యం భూములు కౌలు ద్వార కొంత మేర ఆదాయం దేవాలయానికి వస్తుంది. ఈ గుడి దేవాదాయ,ధర్మాదాయ శాఖ పరిధిలో ఉండటం వలన ఆలయ అభివృద్ధికి, ఉత్సవాలకు అంతంత మాత్రంగానే నిధులు సమకూరతాయి.

ఆలయ అభివృద్ధికి, దేవాలయ, ఉత్సవాల నిర్వాహణకు గ్రామస్తులు ఒక కమిటిగా ఏర్పడి దాతల, గ్రామ పెద్దల, గ్రామస్తుల సహకారంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారు.

శ్రీభ్రమరాంబ సిద్ధేశ్వర దేవాలయ అభివృద్ధి సేవా సంఘం - 2019

ప్రెసిడెంట్ మేకల భగవదాసు, వైస్ ప్రెసిడెంట్ బొంతా వీరయ్య, సెక్రటరి గెల్లిపోగు సుధాకర్, జాయింట్ సెక్రటరి, యాకసిరి మల్లయ్య, ట్రెజరర్, గంగుల సిద్ధిరాజులు, సభ్యులు పుచ్చకాయల ఆదినారాయణ, అంకిపల్లి సిద్ధయ్య, బొంతా రామాంజయ్య వార్లు.



7వ శతాబ్ధంనాటి బాదామి చాళుక్యుల రాజ్యంలో తేరాల గ్రామం

ఇందుకు ఆధారములు

01. శ్రీసిద్దేశ్వరస్వామి చరిత్ర, మేకల సుబ్బారాయుడు.

02. శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామివారి ఆలయ చరిత్ర(2021), పావులూరి సతీష్‌బాబు.

03. శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి క్షేత్ర మహాత్మ్యం(2014), చిరతనగుండ్ల సోమేశ్వరరావు.

04. తెలంగాణా శాసనాలు వ్యాల్యూమ్ 4(1973), మల్లంపల్లి సోమశేఖరశర్మ

05. మీ పురోహిత్. కాం.

06. పరశురాముడు, కార్తవీర్యార్జునుడు - వికీపీడియా.

07. గూగుల్ ఎర్తు మ్యాప్

08. పలనాటి వీరగాథ(1998), తిరుపతి వేంకట లక్ష్మీ నరసింహారావు.

09. జిల్లా చరిత్ర, ఈనాడు వెబ్ సైట్.

10. మే 24, 2010 దిహిందు వెబ్ సైట్.

11. అర్చివోలాగ్. కాం.

12. తేరాల గ్రామస్థులు, ఆలయ అర్చకుల మౌఖిక వివరణలు.

13. ఎస్.ఐ.ఐ. వ్యాల్యూమ్ 40.

14. పల్నాటి చరిత్ర(1953), రావిపాటి లక్ష్మీనారాయణ.

15. ది ఆంటిక్వారియన్ రిమైన్స్ ఇన్ ది ప్రెసిడెన్సీ ఆఫ్ మెడ్రాస్(1882), రాబెర్ట్ స్వేల్

శుభం



ఉగాది కవి సమ్మేళనంలో రచయిత పావులూరి సతీష్‌బాబు సన్మానం అందుకున్న దృశ్యం

సతీష్ రచన మాచర్ల శ్రీచెన్నకేశవస్వామి వారి ఆలయ చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న
పొట్టిశ్రీరాములు తెలుగు యూనివర్సిటి వైస్ ఛాన్సలర్ ప్రొ.తంగెడ కిషన్‌రావు, ప్రో. బిట్టు వెంకటేశ్వర్లు,
బుద్ధవనం ప్రాజెక్టు ప్రత్యేకాధికారి మారేపల్లి లక్ష్మయ్య, ప్రముఖ స్థపతి ఈమని శివనాగిరెడ్డి తదితరులు



సతీష్‌బాబు రచన శ్రీరామప్పగుడి చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్, మాచర్ల శాసనసభ్యులు
శ్రీ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ తురకా కిషోర్ తదితరులు

పావులూరి సతీష్ బాబు

జర్నలిస్ట్, రచయిత

మొబైల్ : 8523041222

తల్లిదండ్రులు : పావులూరి ఆంజనేయులు(లేటు) శ్రీమతి రేణుకాదేవి

కులగోత్రాలు : కమ్మ, రావిపళ్ళ

స్వగ్రామం : తిమ్మాపురం, యడ్లపాడు మండలం, గుంటూరు జిల్లా. వృత్తి : విలేఖరి

కుటుంబం : పుష్పలత (భార్య), మోక్షజ్ఞ (కుమారుడు), జాగృతి (కుమార్తె). సురేష్ బాబు (సోదరుడు)

బాలినేని స్వప్న(సోదరి) , అంబేశ్వరరావు(బావ) వీరి కుమారుడు వంశి, కుమార్తె శ్రీలేఖ

మాతృబంధువులు : కీ॥శే॥ బొప్పూడి కేశవయ్య (తాతయ్య), చిట్టెమ్మ (అమ్మమ్మ)

మేనమామలు : బొప్పూడి అప్పారావు, నాగేశ్వరి (హైదరాబాద్)

బొప్పూడి శంకరరావు, వెంకటరత్నం (గణపవరం, చిలకలూరిపేట మండలం), కృష్ణ (లేటు)

వీరి పూర్వస్థానం : గోవిందపురం, చిలకలూరిపేట మండలం.

పితృ బంధువులు : కీ॥శే॥ పావులూరి చంద్రయ్య (తాతయ్య), సౌభాగ్యమ్మ (నాయనమ్మ).

కీ॥శే॥ రత్తయ్య(పెదనాన్న), పిచ్చయ్య, నిర్మల (పెదనాన, పెద్దమ్మ) గుంటూరు, సాంబయ్య , రమ(బాబాయ్, పిన్ని)

రామతులసి(లేటు),సరసమ్మ(లేటు), రాములమ్మ(లేటు), చిన్నామ్మాయి (అత్తమయ్యలు)

వీరి పూర్వస్థానం : తిమ్మాపురం, యడ్లపాడు మండలం, గుంటూరు జిల్లా

అత్తమామలు : నల్లమడుగు నరసింహారావు శ్రీమతి రవణమ్మ, పశర్లపాడు, రెంటచింతల మండలం

అభిరుచి : పుస్తక పఠనం, పల్నాటి చరిత్ర ఆన్వేషణ, ఫోటోగ్రఫి.

ప్రస్తుత నివాసం : ఇంటి నెం. 9-81, 18వ వార్డు, మాచర్ల - 522426. మొబైల్ - 8523041222.

ముద్రిత రచనలు : 1. తేరాల శ్రీ సిద్ధేశ్వరస్వామి వారి ఆలయ చరిత్ర (2018), ద్వితియ ముద్రణ : 2022

2. మాచర్ల శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి వారి ఆలయ చరిత్ర (2021)

3. మాచర్ల శ్రీ రామప్పగుడి చరిత్ర (2022)

అముద్రిత రచనలు : 1. సత్రశాల శ్రీ భ్రమరాంబికా సమేత మల్లిఖార్జున స్వామి క్షేత్ర మహత్త్యము.

2. పలనాటి పేరంటాల్లు 3. పలనాటి వీరగల్లులు 4. మాచర్ల మండల చరిత్ర.

ISBN 978-93-5680-199-8

9 789356 801998

QR CODE